


Truth of News

PRGI Reg No: APTEL/26/A4781

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్




అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 33 | గురువారం 10 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


- ఢిల్లీలో ఓటుహక్కుపై భారీ కోత
- 70 నియోజకవర్గాల్లో 68 చోట్ల గెలుపు మెజారిటీ కంటే అధికంగా ఓటర్ల తొలగింపు
- 'సర్' ప్రారంభానికి కొద్ది నెలల ముందే అసాధారణంగా పెరిగిన డిలీషన్లు
- ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర ప్రశ్నలు
- ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే కుట్ర అంటూ వెల్లువెత్తుతున్న విమర్శలు

# సర్‌కు ముందే 11 లక్షల ఓట్ల తొలగింపు!

ఢిల్లీలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రారంభానికి ముందే ఏకంగా 11 లక్షల మందికి పైగా ఓటర్లు జాబితా నుంచి తొలగించబడటం తీవ్ర కలకలం రేపుతోంది. గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో 70 నియోజకవర్గాల్లో 68 చోట్ల గెలుపు మెజారిటీ కంటే తొలగించిన ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటం ఎన్నికల ప్రక్రియ విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఓటరు జాబితాల ప్రక్షాళన పేరుతో ప్రజల ఓటుహక్కును హరించే ప్రయత్నం జరుగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఢిల్లీలో సర్ ప్రారంభానికి ముందే 11 లక్షల మందికి పైగా ఓటర్లు జాబితా నుంచి తొలగించబడినట్టు తాజా నివేదిక వెల్లడించింది. మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే.. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 68 చోట్ల తొలగించిన ఓటర్ల సంఖ్య గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన గెలుపు మెజారిటీ కంటే అధికంగా ఉంది. ఈ పరిణామాలు ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటరు జాబితాల సవరణ ప్రక్రియపై తీవ్ర అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఓటర్ అధికార్ మంచ్



నిర్వహించిన అధ్యయనంలో ఈ అంశాలు వెలుగులోకి వచ్చాయి. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ), ఢిల్లీ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) విడుదల చేసిన రికార్డులతో పాటు సబర్ ఇన్‌స్టిట్యూట్ గణాంకాలను ఆధారంగా చేసుకుని ఈ అధ్యయనం చేపట్టారు. ఈ నివేదిక ప్రకారం.. 2025 జనవరి 31 నాటికి ఢిల్లీలో 1,56,14,000 మంది ఓటర్లు ఉండగా.. 2026 జూన్ 30 నాటికి

- మిగతా 2లో..



## విద్యార్థికి నోటీసా.. ఎంత ధైర్యం?

- తమ ఆదేశాలనే పెడచెవిన పెడతారా?
- సీజేఐ సూర్యకాంత్ ఆగ్రహం
- విద్యార్థుల్లో భయాందోళన సృష్టించొద్దు
- వివరణ కోరతాం, నోటీసులు రికార్డుల్లోనే ఉంచాలి
- గ్రేటర్ నోయిడా మేజిస్ట్రేట్ ఉత్తర్వులపై సుప్రీంకోర్టు నిలదీత

2

# ప్రతి వారం ప్రజల మధ్యనే ఉంటా

- సీఎం చంద్రబాబు
- కోనసీమ జిల్లాలో 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభ
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు
- గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుతూ రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన
- 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించినట్టు వెల్లడి
- భూమికి పూర్తి భద్రత కల్పించేలా రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాలు
- రూ.240 కోట్లతో ఈపీడీసీఎల్ గ్రిడ్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన



పి.గన్నవరం- సూర్య వాస్తవం

సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు మూల మంత్రాలతోనే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సచివాలయానికి పరిమితమై పనిచేయడం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య ఉంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపడమే అసలైన సుపరిపాలన అని, దానికోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఉద్ఘాటించారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం లోని మాచడవ పండువారిపేటలో బుధవారం నిర్వహించిన 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి వారం ప్రజల వద్దకే వస్తున్నానని, వారి బాగోగులు తెలుసుకుంటూ పాలన సాగిస్తున్నానని తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన పేదల వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్

- మిగతా 2లో..



## లౌకిక సామాజిక న్యాయ విజయ కూటమి

- తమిళనాడులో టీవీకే నేతృత్వంలోని కూటమి పేరు ఇదే..
- ఎస్ఎస్‌జేవీఎఫ్ నాయకుడిగా విజయ్ ఏకగ్రీవం
- కొత్త జట్టులో చేరని వామపక్ష పార్టీలు

చెన్నై - సూర్య వాస్తవం

తమిళనాడులో అధికారంలో ఉన్న టీవీకే పార్టీతో కలిసి ఇప్పటిదాకా మద్దతిచ్చిన పార్టీలన్నీ కలిసి ఒక కూటమిగా ఏర్పడ్డాయి. టీవీకే నేతృత్వంలోని ఈ సరికొత్త జట్టుకు 'లౌకిక సామాజిక న్యాయ విజయ కూటమి(సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ ఫ్రంట్ (ఎస్ఎస్‌జేవీఎఫ్) అని పేరు పెట్టారు. ముఖ్యమంత్రి సీ జోసెఫ్ విజయ్‌ని ఏకగ్రీవంగా కూటమి నాయకుడిగా ఎన్నుకున్నారు.

- మిగతా 2లో..



## దర్యాప్తు సంస్థలను బీజేపీ దుర్వినియోగం చేస్తోంది

- కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు- సూర్య వాస్తవం

మంత్రి సతీష్ జార్కిహోలిని లక్ష్యంగా చేసుకొని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జరిపిన సోదాలు రాజకీయ ప్రేరేపితమైనవని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బుధవారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ)పై విమర్శలు గుప్పించారు. బీజేపీ ఏజెన్సీలను దుర్విని యోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. పలు ప్రాంతాలపై కేంద్ర ఏజెన్సీలు

- మిగతా 2లో..

# ఫాంహౌస్‌లో కుట్రపై సమగ్ర విచారణ

- అసెంబ్లీని అడ్డుకునేందుకే ఫాంహౌస్‌లో కుట్ర: సీఎం
- స్పీకర్‌ను అవమానిస్తే సహించం: సీఎం రేవంత్‌రెడ్డి
- దళితుల అవమానంపై కఠిన చర్యలు: రేవంత్‌రెడ్డి
- అసెంబ్లీ ఘటనలపై సమగ్ర విచారణకు ఆదేశాలు
- ప్రజా సమస్యలపై చర్చను అడ్డుకునేందుకే కుట్ర: సీఎం
- స్పీకర్ అవమానం సమాజానికే అవమానం: రేవంత్‌రెడ్డి
- ఎర్రవల్లి ఫాంహౌస్ ఘటనలపై విచారణ
- దళితులను అవమానించిన వారిని వదలం: సీఎం
- ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు: రేవంత్‌రెడ్డి




హైదరాబాద్ - సూర్య వాస్తవం

శాసనసభ వర్షాకాల సమావేశాల తొలి రోజైన సెప్టెంబర్ 6న చోటుచేసుకున్న కుట్రపూరిత ఘటనలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి దోషులను చట్టపరంగా శిక్షించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం శాసనసభలో జరిగిన సుదీర్ఘ చర్చకు సమాధానమిస్తూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. సెప్టెంబర్ 6న శాసనసభలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం, అనంతరం దళితులు నడిచిన నేలను శుద్ధి చేయడం వంటి ఘటనలపై యావత్ శాసనసభ ఆందోళన వ్యక్తం చేసిందని సీఎం తెలిపారు. ఈ ఘటనలో స్పీకర్‌కు శాసనసభ అండగా నిలిచిందని, మానసికంగా ధైర్యంగా ఉండాలని ఆయనకు సూచించిందన్నారు. స్పీకర్‌ను అవమానించిన వారిని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టదని స్పష్టం చేశారు. అధికారులపై దాడులు చేయడం, శాసనసభాపతి స్థానాన్ని అవమానించేలా వ్యవహరించడం, ఆయన తల్లిని కించ పరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం అత్యంత దారుణమని రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంపై దాడికి

- మిగతా 2లో..



## ఘట్‌కేసర్-కాజీపేట మల్టీట్రాకింగ్

- దేశంలో రూ.20,804 కోట్లతో 8 రైల్వే ప్రాజెక్టులు
- తెలుగు రాష్ట్రాలు సహా 9 రాష్ట్రాల్లో విస్తరణ
- మూడేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యం
- కేంద్ర క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

దేశవ్యాప్తంగా తెలంగాణ ఆంధ్రప్రదేశ్ సహా 9 రాష్ట్రాల్లో రైలు మార్గాల అనుసంధాన ప్రాజెక్టులకు కేంద్రప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మొత్తం రూ.20,804 కోట్ల విలువైన 8 ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేసింది. వీటిలో ఐదు ప్రాజెక్టులు దక్షిణాదిలోని ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. అలాగే మిగతా మూడు ప్రాజెక్టులు తూర్పు, మధ్య భారత్‌లోని పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. తెలంగాణలో ఘట్కేసర్– –కాజీపేట మధ్య 110 కి.మీ మేర మల్టీట్రాకింగ్‌ను ఏర్పాటు చేయనున్నారు. కేంద్రం

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# విద్యార్థికి నోటీసా.. ఎంత ధైర్యం?

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) నిరసనల్లో పాల్గొన్న విద్యార్థికి ఢిల్లీలోని గ్రేటర్ నోయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్-3 కోర్టు నోటీసు జారీచేయడం పట్ల సీజేఐ సూర్యకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'న్యాయ విద్యార్థికి నోటీసా? ఎంత ధైర్యం? ఈ సాహసం ఏ మెజిస్ట్రేట్ ఎలా చేయగలరు? అని గ్రేటర్ నోయిడా మెజిస్ట్రేట్‌ను మందలించారు. విద్యార్థులపై బలవంతపు చర్యలు వద్దని గతంలోనే సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను పెడచెవిన పెట్టారా? అని మండిపడ్డారు. విద్యార్థి అక్షత్ త్రిపాఠికి రూ.5 లక్షల పూచీకత్తు సమర్పించాలని ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆర్కే సిసోడియా జారీ చేసిన నోటీసుపై బుధవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. గతంలో సుప్రీంకోర్టు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందని, అయినా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసులు ఎలా జారీ చేస్తారని నిలదీశారు. విద్యార్థులపై బలవంతపు చర్యలు ఉండవన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తారా? అని ప్రశ్నించారు. ఈ అంశంపై గ్రేటర్ నోయిడా అథారిటీ నుంచి వివరణ కోరతామని, నోటీసులు రికార్డులో ఉంచాలని దేశ అత్యున్నత ధర్మాసనం ఆదేశించింది. ఇలాంటి చర్యలతో విద్యార్థులలో భయాందోళన వాతావరణాన్ని సృష్టించొద్దని వివరణ కోరతామని సీజేఐ సూర్యకాంత్ ప్రకటించారు. జూలై 20 నుంచి 25 మధ్య దేశవ్యాప్తంగా సీజేపీ నేతృత్వంలో జరిగిన నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు రద్దు చేసింది. కాగా సీనియర్ న్యాయవాది బిశ్వజిత్ భట్టాచార్య మాట్లాడుతూ.. నోటీసు జారీ చేసిన విషయం వాస్తవమేనని, ఆ తరువాత దాన్ని ఉపసంహరించుకున్నారని సుప్రీంకోర్టుకు నివేదించారు. అక్షత్ త్రిపాఠి తనకు జారీ చేసిన నోటీసులపై మంగళవారం సామాజిక మాధ్యమం వేదికగా ఆవేదన వ్యక్తం చేస్తూ రూ.5 లక్షల పూచీకత్తు, బీఎన్ఎస్ఎస్ లాంటి కఠిన చట్టాలను తనపై ప్రయోగించారని ఆవేదన వ్యక్తం చేశాడు.

# లౌకిక సామాజిక న్యాయ విజయ కూటమి

(మొదటిపేజీ తరువాయి)

ఈ నయా ఫ్రంట్‌లో వామపక్ష పార్టీలు చేరలేదు. బుధవారం సీఎం విజయ్ నేతృత్వంలో మిత్రపక్షాలన్నీ సమావేశమై కూటమిగా ఏర్పడ్డాయి. ఈ సమావేశంలో, రాష్ట్రంలోని రెండు నియోజకవర్గాలకు అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టడంపై కూడా చర్చించారు. అధికార టీవీకే పార్టీకి ఇది మొదటి కీలక పరీక్ష కానుంది. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన టీవీకే సీనియర్ నాయకుడు, ప్రజా పనుల శాఖ మంత్రి ఆధవ్ అర్జున, తమ పార్టీ నేతృత్వంలోని కూటమి ఖరారైందని, ఇది కేవలం ఎన్నికల కోసం మాత్రమే కాదని పేర్కొన్నారు. సంస్కరణ ఉద్యమకారులైన పెరియార్ ఈవీ రామసామి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ద్రావిడ ఉద్యమ నేత సీఎన్ అన్నాదురై ఆశయాలకు అనుగుణంగా, ప్రజల కోసం ఏర్పడిన సిద్ధాంతపరమైన కూటమి ఇది అని ఆయన స్పష్టం చేశారు. 'లౌకికవాదం, సామాజిక న్యాయం ఎక్కడ ఉంటాయో, అక్కడ విజయం ఖాయం. ఇది ప్రజల కోసం ఉద్దేశించిన కూటమి' అని అర్జున వెల్లడించారు. వామపక్ష పార్టీలు ఈ కూటమిలో చేరకపోవడంపై స్పందిస్తూ, 'వామపక్ష పార్టీల పట్ల మాకు ఎంతో గౌరవం ఉంది' అని అన్నారు. అంతేకాకుండా వామపక్ష పార్టీల మనసు ఎప్పటికీ ఈ కూటమితోనే ఉంటుందని, వారు టీవీకే నేతృత్వంలోని ప్రభుత్వానికి మద్దతునిస్తూనే ఉంటారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 'కేవలం తమిళనాడులోనే కాకుండా దేశవ్యాప్తంగా లౌకికవాదాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని వీసీకే అధినేత తిరుమావళవన్ అన్నారు. ఈ అవగాహనతోనే కాంగ్రెస్, ఐయూఎంఎల్, వీసీకే, ఎండీఎంకే పార్టీలు ఏకగ్రీవంగా ఈ కూటమిని ఏర్పాటు చేశాయని ఆయన పేర్కొన్నారు. మధురాంతకం, ధరాపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు అక్టోబర్ 6న ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఉపఎన్నికలకు అభ్యర్థుల పేర్లను గురువారం ప్రకటి స్తామని, కూటమి అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తామని టీఎన్‌సీసీ అధ్యక్షుడు బీ మా ణిక్యం ఠాగూర్ తెలిపారు. తమిళనాడులో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడటం ఇదే మొదటిసారి కాబట్టి ఒక 'కొత్త చరిత్ర' సృష్టించబడిందని ఐయూఎంఎల్ అగ్రనేత ఖాదర్ మొహిదీన్ పేర్కొన్నారు.

# ఘట్‌కేసర్-కాజీపేట మల్టీట్రాకింగ్

(మొదటిపేజీ తరువాయి)

తాజా నిర్ణయంతో ఢిలీ-హౌరా, హౌరా-ముంబై, ఢిల్లీ--ముంబై, ఢిల్లీ--గువా హటి, ఢిలీ-చెన్నై, హౌరా--చెన్నై, ముంబై--చెన్నై మార్గాల్లో ప్రస్తుతం ఉన్న రైల్వే నెట్‌వర్క్‌ను నాలుగు లైన్లకు పెంచనున్నారు. దీంతో ఆయా రాష్ట్రాల్లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలకు రైలు సౌకర్యం అందుబాటులోకి రానుంది. రైల్వేల విస్తరణ ప్రయాణికులతో పాటు సరకు రవాణా సులభతరం చేయడానికి సహాయపడతాయి. వీటి ద్వారా దాదాపు కోటి మందికిపైగా ప్రయోజనం కలుగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) దేశంలో రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. తొమ్మిది రాష్ట్రాల్లోని రూ.20,804 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టు లకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దాదాపు 1,196 కిలోమీటర్ల మేర విస్తరించే ఈ ప్రాజెక్టుల ద్వారా రైలు అనుసంధానం (కనెక్టివిటీ) మెరుగుపడటంతో పాటు, ప్రస్తుత మార్గాల్లో రద్దీ తగ్గి ప్రయాణికులు, సరుకుల రవాణా వేగవంతం కానుంది. ఈ ప్రాజెక్టులను 2029- నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టులు 'కనెక్టివిటీని పెంచడంతో పాటు ప్రయాణాన్ని సులభతరం చేస్తాయని, సరుకులు, ప్రయాణికుల రవాణాను వేగవంతం చేస్తాయని' ప్రభుత్వం తెలిపింది. దక్షిణాది రాష్ట్రాల్లోని ఐదు ప్రాజెక్టులు 17 జిల్లాల గుం డా వెళ్తూ, 2,121 గ్రామాలకు రైలు సౌకర్యాన్ని కల్పిస్తాయి. దీని ద్వారా దాదాపు 52 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. తూర్పు, మధ్య భారతదేశంలోని మూడు ప్రాజెక్టులు 14 జిల్లాలను కవర్ చేస్తూ, దాదాపు 56 లక్షల జనాభా ఉన్న 4,790 గ్రామాలను అనుసంధా నిస్తాయి.

# దర్యాప్తు సంస్థలను బీజేపీ దుర్వినియోగం చేస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

సమన్వయంతో జరిపిన సోదాలపై సీఎం మీడియాతో మాట్లాడుతూ.. ఈ పరిణామాలకు రాష్ట్ర నాయకత్వం చలించలేదని శివకుమార్ స్పష్టం చేశారు. మంత్రిపై జరిగిన జుణ సోదాల గురించి తమకు తెలియనిదేమీ కాదు. గతంలో కూడా జుణ సోదాలు జరిగాయి. ఆయన ఒక సీనియర్ మంత్రి, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలలో పాలుపంచు కుంటున్నారు. ఆయన కొన్ని సామాజిక సేవా కార్యక్రమాలను కూడా చేపట్టారు." దాచడానికి ఏమీ లేదు. వారు(బీజేపీ) ఎలాంటి విచారణనైనా జరపనివ్వండి, ఆయన దానికి స్పందిస్తారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బీజేపీ రాజకీయంగా దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోంది.

# సర్‌కు ముందే 11 లక్షల ఓట్ల తొలగింపు!

(మొదటిపేజీ తరువాయి)

ఈ సంఖ్య 1,45,10,299కు పడిపోయింది. అంటే సర్ ప్రారంభమయ్యేలోపే 11,03,701 మంది ఓటర్లు జాబితా నుంచి తొలగించబడ్డారు. సాధారణంగా ఓటరు జాబితా సవరణల మధ్య ప్రతి నెలా పేర్ల చేర్పులు, తొలగింపులు జరుగుతుంటాయి. ప్రతి నియోజకవర్గానికి సంబంధించిన ఈ వివరాలను ఢిల్లీ సీఈఓ విడుదల చేస్తుంటారు. అయితే సర్ ప్రారంభానికి రెండు నుంచి మూడు నెలల ముందు ఓటర్ల తొలగింపు అసాధారణంగా పెరిగిందని నివేదిక పేర్కొంది.

**'ఈసీ సమాధానం చెప్పాలి'**

గతేడాది ఫిబ్రవరి నుంచి డిసెంబర్ వరకు మొత్తం 70 నియోజకవర్గాల్లో నికరంగా 1,00,613 మంది ఓటర్లు పెరిగారు. కానీ ఈ ఏడాది జనవరి నుంచి జూన్ మధ్య కాలంలో ఏకంగా 11,70,885 మంది ఓటర్లు తగ్గిపోయారు. ముఖ్యంగా ఏప్రిల్‌లోనే 3,39,509 మంది ఓటర్ల పేర్లు తొలగించబడటం గమనార్హం. ఈ సంఖ్య అంతకుముందు ఆరు నెలల సగటు నెలవారీ తొలగింపుల కంటే దాదాపు 20 రెట్లు అధికం. అలాగే గతేడాది జులై నుంచి డిసెంబర్ వరకు జరిగిన మొత్తం ఓటర్ల తొలగింపుల కంటే ఇది మూడు రెట్లకు పైగా ఉండటం గమనార్హం. ఒక్కసారిగా ఇంత భారీ స్థాయిలో ఓటర్ల పేర్లు ఎందుకు తొలగించాల్సి వచ్చిందనే ప్రశ్నకు ఎన్నికల సంఘం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ప్రజాస్వామ్య వాదులు, సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. పది కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో ఓటర్ల తొలగింపు రేటు 40 శాతానికి మించి ఉన్నట్టు అధ్యయనం గుర్తించింది.

**ప్రజాస్వామ్యానికి ప్రమాదం : యోగేంద్ర యాదవ్**

సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్ ఎన్నికల ప్రక్రియపై తీవ్ర విమర్శలు చేశారు. సర్ ప్రక్రియ ముగిసే నాటికి దేశంలో 103 కోట్ల మంది వయోజనులు ఉన్నప్పటికీ, ఓటర్ల సంఖ్య 88 కోట్లకే పరిమితమయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో దేశంలో 99 కోట్ల మంది వయోజనులు ఉండగా.. 98 కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు కోట్లాది మంది వయోజనులు ఓటరు జాబితాలకు దూరమవుతున్న పరిస్థితి ఏర్పడటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని ఆందోళన వ్యక్తం చేశారు. "ఇది సాధారణంగా జరిగే విషయం కాదు. ముందస్తు ప్రణాళిక లేకుండా, వ్యవస్థ మొత్తం ప్రమేయం లేకుండా ఇంత భారీ స్థాయిలో ఓటర్ల తొలగింపు జరగదు. ముఖ్యంగా సర్ ప్రారంభానికి ముందే జరిగిన భారీ తొలగింపులపై దర్యాప్తు జరగాలి. ఇది నేరపూరిత కుట్రగా విచారించాల్సిన అంశం. ప్రజలను ఓటుహక్కుకు దూరం చేయడమే సర్ లక్ష్యం గా కనిపిస్తోంది" అని యోగేంద్ర యాదవ్ ఆరోపించారు.

**ఆ ఐదు రాష్ట్రాలు...**

సర్ వడో దశ ముసాయిదా ఓటరు జాబితాల్లో అత్యధిక తొలగింపులు జరిగిన ఐదు రాష్ట్రాల్లో గత మూడేండ్లలో అసెంబ్లీ ఎన్నికలు జరిగిన రాష్ట్రాలే ఉన్నాయి. మహారాష్ట్ర, ఏపీలో 2024లో, కర్నాటక, తెలంగాణలో 2023లో, ఢిల్లీలో 2025లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ పరిణామం రాజకీయంగానూ తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఎన్నికలు జరిగిన కొద్ది కాలానికే అదే రాష్ట్రాల్లో భారీ స్థాయిలో ఓటర్ల తొలగింపులు వెలుగులోకి రావడం యాదృచ్ఛికమా? లేక ఓటరు జాబితాల నిర్వహణలో తీవ్రమైన లోపాలున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**గతేడాది జరిగిన ఢిల్లీ ఎన్నికల సంగతేంటి? : సామాజిక కార్యకర్త అంజలి భరద్వాజ్**

సామాజిక కార్యకర్త అంజలి భరద్వాజ్ కూడా ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. గతేడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు 1.56 కోట్ల మంది ఓటర్లతో జరిగాయనీ, ఇప్పుడు దాదాపు 91 లక్షల మంది ఓటర్లు తొలగించబడటం లేదా వారికి నోటీసులు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. "ఇప్పుడు ఎన్నికల సంఘమే తన ఓటరు జాబితాలో ఇన్ని తప్పులు ఉన్నాయని చెప్తుంటే.. గతేడాది జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల విశ్వసనీయత ఎంత? ప్రజలు ఈ ప్రక్రియను ఎలా నమ్మాలి? ఇన్ని లోపాలు బయటపడితే బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?" అని ఆమె ప్రశ్నించారు. గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి వచ్చిన విషయం విదితమే.

**ఓటుహక్కుపై పెరుగుతున్న ఆందోళన**

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యమని గొప్పలు చెప్పుకునే దేశంలో ఓటుహక్కు పరిరక్షణ అత్యంత కీలకమైన అంశం. ఓటరు జాబితాల నుంచి పేర్లు తొలగించడం అనేది కేవలం సాంకేతిక ప్రక్రియ మాత్రమే కాదు. ఒక పౌరుడి రాజకీయ హక్కును నేరుగా ప్రభావితం చేసే చర్య. అయితే ప్రస్తుతం దేశంలో ఎన్నికల సంఘం స్వతంత్రత, ఎన్నికల ప్రక్రియ పారదర్శకతపై ఇప్పటికే అనేక ప్రశ్నలు తలెత్తుతున్న సమయంలో ఢిల్లీలో ఈ భారీ తొలగింపుల అంశం మరింత ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా బీజేపీ పాలనలోని కేంద్ర ప్రభుత్వ హయాంలో ఎన్నికల సంస్థల స్వతంత్రతపై ప్రతిపక్షాలు, పౌరసంఘాలు పదేపదే సందేహాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో తాజా గణాంకాలు ఆ అనుమానాలకు మరింత బలం చేకూర్చుతున్నాయి.

# ప్రతి వారం ప్రజల మధ్యనే ఉంటా

(మొదటిపేజీ తరువాయి)

అందిస్తూ వారి కష్టసుఖాలను తెలుసుకుంటున్నానని సీఎం గుర్తుచేశారు. అలాగే, ప్రతి నెలా మూడో శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో, నాలుగో శనివారం పీ4 (ప్రజలు, ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యం) కార్యక్రమంలో పాల్గొంటూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరిగితేనే సంపద సృష్టి జరుగుతుందని, తద్వారా ప్రజలంతా గౌరవంగా జీవించేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

**భూమికి భద్రత.. గత ప్రభుత్వ పాపాల ప్రక్షాళన**

ప్రతి నెలా 9వ తేదీన 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమం ద్వారా రైతులకు, యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని సీఎం తెలిపారు. భూమిపై యజమానులకు తిరుగులేని హక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత పాలకులు తమ ఐదేళ్ల పాలనలో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేశారని, రికార్డులను తారుమారు చేసి ఘోరాలు, నేరాలు, పాపాలు చేశారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో ప్రజల భూములను కాజేసేందుకు కుట్ర పన్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ప్రమాదకర చట్టాన్ని రద్దు చేసి ప్రజలకు భరోసా ఇచ్చిందని గుర్తుచేశారు. "రీసర్వే పేరుతో గత ప్రభుత్వం చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములపై కూడా తమ ఫొటోలు వేసుకున్నారు. సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకునే పిచ్చి ఏమిటో ఎవరికీ అర్థం కాలేదు. తమకు ఇష్టం లేని వ్యక్తుల భూములను, ఆస్తులను 22ఏ జాబితాలో చేర్చి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. అందుకే ఇప్పుడు పటిష్ఠమైన రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి, ఎక్కడా అవకతవకలకు తావులేకుండా బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, ఈ-కేవైసీ, క్యూఆర్ కోడ్ వంటి భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నాం"అని చంద్రబాబు వివరించారు.

**రికార్డు స్థాయిలో రెవెన్యూ సంస్కరణలు**

భూమికి సంపూర్ణ భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ అజెండా అని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,234 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి, 36 లక్షల మందికి రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు అందించామని తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన 8,582 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి మొత్తం 56 లక్షల పాస్ పుస్తకాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆటో మ్యూటేషన్ సేవలు అందుబాటులోకి తెచ్చామని, వారసత్వ భూముల విభజనలో స్టాంప్ డ్యూటీని కేవలం రూ.1000కి పరిమితం చేయడం ద్వారా 1.25 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చామని చెప్పారు.గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి లక్షలాది మందికి ఊరట కల్పించామని అన్నారు. శెట్టిపల్లి కంగుంది, వట్టి చెరుకూరు, ముదినేపల్లి వంటి ప్రాంతాల్లో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న 244 కీలక భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించామని తెలిపారు.

అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రాపురంలో బ్రిటిష్ కాలం నాటి (1908) 22ఏ(1) నిషేధిత భూముల సమస్యను కూడా పరిష్కరిస్తున్నామని, దీని ద్వారా 1410 మందికి చెందిన 56.37 ఎకరాల భూమికి విముక్తి కల్పిస్తున్నామని ప్రకటించారు. "గొడ్డలి పార్టీ తారుమారు చేసిన రికార్డులను ప్రక్షాళన చేసి భూ సమస్యలను కొలిక్కి తెస్తున్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు.

**ప్రజల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యం**

భూమి భద్రతతో పాటు నీటి భద్రతకు కూడా తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం అన్నారు. ఈ ఏడాది తీవ్రమైన ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ, గోదావరి నుంచి వెయ్యి టీఎంసీలకు పైగా నీరు సముద్రంలో వృథాగా కలిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం, రాజకీయ కక్షతో కాంట్రాక్టర్‌ను మార్చడం వల్లే పోలవరం డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయి ప్రాజెక్టు ఆలస్యమైందని ఆరోపించారు.

2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఢిల్లీలో సంజీవనిలా పనిచేసిందని, కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకోగలుగుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా, తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) రూ.240 కోట్ల వ్యయంతో చేపట్టిన గ్రిడ్ ఆధునీకరణ, 3-ఫేజ్ విద్యుత్ సరఫరా పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీశ్, స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఫాంహౌస్‌లో కుట్రపై సమగ్ర విచారణ

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నించే ఉగ్రవాదులు, తీవ్రవాదుల చర్యలతో సమానంగా కాకపోయినా.. ప్రజాస్వామ్య వ్యవస్థను, శాసనసభాపతి పదవిని అవమానించేలా పథకం ప్రకారం వ్యవహరించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని పేర్కొన్నారు.

**తల్లిని అవమానించడం దారుణం:**

తెలంగాణది మాతృస్వామ్య సమాజమని ముఖ్యమంత్రి అన్నారు. మహిళను అపరకాళి, భద్రకాళి, భూమాత, భారతమాత, తెలంగాణ తల్లి వంటి గౌరవప్రదమైన రూపాల్లో కొలిచే సంప్రదాయం మనదని తెలిపారు. గొప్పతనాన్ని, శక్తిని వ్యక్తీకరించాల్సిన సందర్భాల్లో తల్లితో పోల్చుకునే మన సమాజంలో ఒక తల్లిని అవమానించేలా ప్రవర్తించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సభాపతికి జరిగిన అవమానం మొత్తం సమాజానికి జరిగిన అవమానంగా భావించాలని సీఎం అన్నారు. ఈ ఘటనకు బాధ్యులను తెలంగాణ సమాజం ఉపేక్షించదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన వ్యక్తం చేయడానికి అనేక మార్గాలు ఉన్నాయని, అయితే సభాపతి మనసుకు గాయం చేసేలా వ్యవహరించడం మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. బాధ్యులను చట్టపరంగా శిక్షించే విషయంలో ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరిస్తుందని తెలిపారు.

**ఘటనలపై సమగ్ర విచారణ:**

ఎర్రవల్లి ఫాంహౌస్‌లో జరిగిన పరిణామాలతో పాటు శాసనసభలో చోటుచేసుకున్న ఘటనలపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించిందని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. విచారణ అధికారిగా ఐపీఎస్ అధికారి విజయ్‌కుమార్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ నెల 6న ఫాంహౌస్‌లో కుట్రకు ప్రణాళికలు రూపొందించారని, 7న స్పీకర్‌పై మాటల దాడి జరిగిందని, 8న ఫాంహౌస్‌లో శుద్ధి కార్యక్రమం చేపట్టారని సీఎం ఆరోపించారు. ప్రత్యక్షంగా పాల్గొన్న వారితో పాటు కుట్రకు పాల్పడిన వారందరిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుట్ర చేసిన వారిని, దానిని అమలు చేసిన వారిని కోర్టు ముందు నిలబెట్టి శిక్షించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**అసెంబ్లీని అడ్డుకునేందుకే కుట్ర:**

ప్రజా సమస్యలపై చర్చించేందుకే శాసనసభ సమావేశాలను ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. సెప్టెంబర్ 7 నుంచి విద్యారంగ సమస్యలు, ధరణిలో జరిగిన అక్రమాలు, 22(ఎ) భూములు సహా ప్రతిపక్షాలు లేవనెత్తిన అనేక అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అయితే ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా సభను అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఎర్రవల్లి ఫాంహౌస్‌కు పిలిపించి కుట్రకు ప్రణాళికలు రచించారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రజా సమస్యలపై చర్చ జరిగితే రాజకీయంగా ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతోనే సభను అడ్డుకునేందుకు కుట్ర చేశారని విమర్శించారు.

**దళితుల నిరసనను వక్రీకరించొద్దు:**

ఎర్రవల్లి ఫాంహౌస్‌లో పన్నిన కుట్రలకు వ్యతిరేకంగానే దళితులు అక్కడ నిరసనకు వెళ్లారని సీఎం తెలిపారు. దాడులు చేయాలనే ఉద్దేశం వారికి లేదని, ప్రజాస్వామిక పద్ధతిలో డప్పు కొట్టి దండోరా వేయడం ద్వారా తమ నిరసనను వ్యక్తం చేశారని పేర్కొన్నారు. దళితులను ఉద్దేశపూర్వకంగా అవమానించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, విద్వేషాలు, అల్లర్లు రెచ్చగొట్టడం నేరమని హెచ్చరించారు. గతంలో ఉత్తరాఖండ్‌లో జరిగిన ఘటనను తాము ఖండించామని, అలాంటి పరిణామమే తెలంగాణలో చోటుచేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. దళితులపై అణచివేత, దురాగతాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## సంపాదకీయం

# వ్యవసాయానికి డేంజర్ బెల్స్...




దేశం మొత్తం మీదా వర్షం పరిస్థితి ఆశాజనకంగా లేదు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణంగా దేశంలో సుమారు 870 మిల్లీమీటర్ల వర్షం పడాలి. కానీ సెప్టెంబర్ మొదటి వారం నాటికి సీజనల్ వర్షపాతం సాధారణం కంటే 13 శాతం తక్కువగా ఉంది. జూన్‌లో ఏకంగా 35 శాతం లోటు నమోదైంది. జూలైలో కొంత వర్షం పుంజుకున్నా.. ఆగస్టులో మళ్లీ 16 శాతం లోటు వచ్చింది. ప్రాంతాల వారీగా చూస్తే దక్షిణ ద్వీపకల్పంలో దాదాపు 27 శాతం వర్ష లోటు ఉంది. అంటే తెలంగాణ, ఏపీ సహా దక్షిణాది ప్రాంతాలపై వర్షాభావ ప్రభావం ఎక్కువగా ఉంది. సెప్టెంబర్‌లోనూ సాధారణం కంటే తక్కువ వర్షాలు పడే అవకాశం ఉండటంతో.. ఈసారి నైరుతి సీజన్ దేశవ్యాప్తంగా లోటుతో ముగిసే పరిస్థితి కనిపిస్తోంది. వాతావరణ మార్పులు, రుతుపవనాల తీరు, ఎల్‌నినో వంటి ప్రభావాలు కూడా వ్యవసాయంపై ప్రభావం చూపుతున్నాయి. వ్యవసాయం ఇప్పటికీ వానపై చాలా వరకు ఆధారపడి ఉంది. నైరుతి రుతుపవనాల సమయంలో వచ్చే వర్షాలే చెరువులను నింపాలి. వాగులు, వంకల్లో నీరు పారాలి. భూగర్భ జలాలు పెరగాలి. బోర్లలో నీరు ఉండాలి. ప్రాజెక్టులకు నీరు చేరాలి. అప్పుడే రైతు పొలంలో పంట నిలబడుతుంది. కానీ ఈసారి కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి తేడాగా ఉంది. ఒకవైపు వర్షం తక్కువగా పడుతోంది. మరోవైపు పడిన వాన కూడా ఒకే ప్రాంతంలో కురుస్తోంది. కొన్ని చోట్ల భారీ వర్షాలు పడుతున్నా.. మరికొన్ని ప్రాంతాల్లో చినుకులు కూడా కరువవుతున్నాయి. దీంతో రాష్ట్ర సగటు లెక్క కంటే గ్రామం, మండలం స్థాయిలో రైతు ఎదుర్కొంటున్న కష్టం ఎక్కువగా కనిపిస్తోంది.వర్షం తగ్గితే మొదట నేలలో తేమ తగ్గుతుంది. తర్వాత చెరువుల్లోకి వచ్చే నీరు తగ్గుతుంది. చెరువులు నిండకపోతే భూగర్భ జలాలు పెరగవు. బోర్లు ఎండిపోతే రైతు ప్రాజెక్టుల వైపు చూస్తాడు. అక్కడి నుంచి కాలువల ద్వారా నీరు రావాలి. కాలువ చివరి ఆయకట్టులో ఉన్న రైతు పొలానికి కూడా నీరు చేరాలి. అప్పుడే ప్రాజెక్టులో ఉన్న నీరు రైతుకు ఉపయోగపడుతుంది. తెలంగాణ నీటి అసలు లెక్క మొదలవుతుంది. ప్రాజెక్టుల్లో నీరు ఉండటం ఒక లెక్క. ఆ నీరు పొలానికి చేరడం మరో లెక్క. వర్షం తక్కువైతే రైతు కష్టం అక్కడితో ఆగదు. విత్తనం కొనాలి. ఎరువులు వేయాలి. మందులు కొనాలి. కూలీలకు డబ్బులు ఇవ్వాలి. నీరు లేకపోతే బోరు నడపాలి. విద్యుత్ ఖర్చు పెరుగుతుంది. పంట నిలబడకపోతే మళ్లీ విత్తనం వేయాల్సి వస్తుంది. ఇలా వాన తగ్గిన ప్రతి దశలో రైతు ఖర్చు పెరుగుతూనే ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే పంటలను తిరిగి విత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకసారి వేసిన పంట ఎండిపోతే మరోసారి పెట్టుబడి పెట్టాలి. రెండోసారి కూడా వాన రాకపోతే మరోసారి అప్పు చేయాల్సి వస్తుంది. చివరికి ఆకాశంలో పడని వాన..రైతు జేబులో అప్పుగా మారుతుంది. మరో వైపు ప్రాజెక్టుల నీటిపై రాజకీయ రచ్చ మొదలవుతోంది. ఎవరి హయాంలో ఏ ప్రాజెక్టు వచ్చిందని అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. రాజకీయ పార్టీలకు నీరు ఒక రాజకీయ అంశం కావచ్చు. కానీ రైతుకు మాత్రం నీరు జీవనాధారం. పంటకు నీరు రావాలి. పంట చేతికి రావాలి. పంటకు గిట్టుబాటు ధర రావాలి. అప్పు తీర్చాలి. ఇంటిని నడపాలి. రైతు ఆలోచన ఇలానే సాగుతోంది. నీటి లెక్కను కేవలం ప్రాజెక్టుల దగ్గర ఆపకూడదు. ఆకాశం నుంచి మొదలుపెట్టి రైతు పొలం వరకు చూడాలి. ఎంత వర్షం పడాలి. ఎంత పడింది. గత ఐదేళ్లలో ఎంత పడింది. పదేళ్ల సగటుతో పోలిస్తే పరిస్థితి ఎలా ఉంది. ఏ జిల్లాల్లో వర్షం తగ్గింది. ఏ మండలాల్లో లోటు ఎక్కువగా ఉంది. ఏ ప్రాంతాల్లో భూగర్భ జలాలు పడిపోయాయి. ఎన్ని చెరువులు నిండాయి. ఎన్ని ఖాళీగా ఉన్నాయి. ఈ లెక్కలన్నీ కలిపితేనే వర్షం ప్రభావం ఎంత పెద్దదో అర్థమవుతుంది.పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోను వర్షం ముఖం చాటేసింది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 6 వరకు రాష్ట్రంలో సాధారణంగా 452.9 మిల్లీమీటర్ల వర్షం పడాలి. కానీ ఇప్పటివరకు 203.9 మిల్లీమీటర్లే నమోదైంది. అంటే ఏకంగా 55 శాతం వర్ష లోటు. 28 జిల్లాల్లోనూ లోటు పరిస్థితే ఉంది. అన్నమయ్య జిల్లాలో 77.5 శాతం, ప్రకాశంలో 71.4 శాతం, విశాఖలో 60.4 శాతం లోటు నమోదైంది. దీంతో వర్షాధార వ్యవసాయంతో పాటు భూగర్భ జలాలు, చెరువులు, ప్రాజెక్టుల నీటి నిల్వలపైనా ప్రభావం పడుతోంది.ఇప్పుడు నీటిని కేవలం ప్రాజెక్టుల సమస్యగా చూడలేం. వర్షపు నీటిని ఎంత వరకు ఒడిసిపట్టుకుంటున్నాం. చెరువులను ఎంత వరకు కాపాడుతున్నాం. భూగర్భ జలాలను ఎలా పెంచుతున్నాం. పట్టణాల్లో వర్షపు నీరు ఎంత వృథా అవుతోంది. గ్రామాల్లో చెరువులు, కుంటలు, కాలువల పరిస్థితి ఎలా ఉందో ఆలోచించాలి. ఒక గ్రామాన్ని తీసుకుంటే ఈ సమస్య మొత్తం కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. ఆ గ్రామంలో సాధారణంగా ఎంత వర్షం పడుతుంది. ఈసారి ఎంత పడింది. చెరువులోకి ఎంత నీరు వచ్చింది. బోర్లలో నీటి మట్టం ఎంత తగ్గింది. ఎన్ని బోర్లు పనిచేస్తున్నాయి. ఎన్ని ఎండిపోయాయి. ఎన్ని ఎకరాల్లో పంట వేశారు. ఎన్ని ఎకరాలకు నీరు అందింది. ఎంత పెట్టుబడి పెట్టారు. పంట దెబ్బతింటే రైతుకు ఎంత నష్టం వచ్చింది. చివరికి ఎంత అప్పు మిగిలింది. ఈ లెక్కను ఒక గ్రామం నుంచి చూపిస్తే తెలంగాణ మొత్తం నీటి కష్టాన్ని అర్థం చేసుకోవచ్చు.తెలంగాణలో వానాకాలం సాధారణ సాగు విస్తీర్ణం 132.4 లక్షల ఎకరాలు. ఈసారి సెప్టెంబర్ 2 నాటికి 119.6 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. అంటే సాధారణ సాగులో దాదాపు 90 శాతం పూర్తయింది. గతేడాది ఇదే సమయానికి 123.5 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. ఏపీలోనైతే సాధారణ విస్తీర్ణం 76.2 లక్షల ఎకరాలు. ఈసారి వేసింది 57.8 లక్షల ఎకరాలు. గతంలో పోల్చుకుంటే 18.4 లక్షల ఎకరాలు తగ్గింది. అంటే సాధారణ సాగుతో పోలిస్తే 24.1 శాతం తక్కువగా ఉంది.దేశవ్యాప్తంగా ఈసారి ఖరీఫ్‌లో సెప్టెంబర్ 4 నాటికి 1,086 లక్షల హెక్టార్లలో సాగు జరిగింది. అంటే సుమారు 268.5 మిలియన్ ఎకరాల్లో పంటలు వేశారు. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే దేశంలో సాగు విస్తీర్ణం 1.6 శాతం తక్కువగా ఉంది.మబ్బులో నుంచి వచ్చిన నీటిలో ఎంత మన దగ్గర నిలిచింది. చెరువుల్లో ఎంత చేరింది. భూగర్భంలోకి ఎంత వెళ్లింది. ప్రాజెక్టుల్లో ఎంత నిల్వ ఉంది. కాలువల్లోకి ఎంత విడుదలైంది. రైతు పొలానికి ఎంత చేరింది. ఆ నీటితో ఎంత పంట పండింది. ఆ పంటతో రైతు చేతిలో చివరికి ఎంత మిగిలింది. ఈ మొత్తం లెక్కే తెలంగాణ నీటి అసలు లెక్క.ఆకాశం వాన ఇవ్వాలి. చెరువు నీటిని దాచుకోవాలి. ప్రాజెక్టు నీటిని పొలానికి చేర్చాలి. రైతు పంట పండించాలి. పంటకు మంచి ధర రావాలి. అప్పు తీరాలి. అప్పుడే నీటి లెక్క రైతు జీవితంలో మంచి ఫలితంగా మారుతుంది. వాన కోసం ఆకాశం వైపు చూసే రైతు కళ్లలో నీరు కాదు. నమ్మకం ఉండాలి. ఆ నమ్మకాన్ని నిలబెట్టేది కేవలం వర్షం కాదు. మన నీటి నిర్వహణ అనేది నిజం. ఆ దిశగా పాలకులు ఆలోచిస్తే అన్నదాత ఆందోళన చెందాల్సిన అవసరం




# ట్రెల్లిస్ స్కూల్లో దారుణం...

## - బాలికపై అసభ్య ప్రవర్తన...!

- తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు
- పాఠశాల నిర్లక్ష్యంపై ఆరోపణలు
- బాలికల భద్రతపై మరింత అప్రమత్తత అవసరం

**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం:** అనంతపురం నగరంలోని స్థానిక జీసస్ నగర్లోని ట్రెల్లిస్ స్కూల్‌లో ఓ బాలికపై అసభ్య ప్రవర్తనకు పాల్పడినట్లు ఆరోపణలు వెలుగులోకి రావడం కలకలం రేపింది. మరుగుదొడ్డికి వెళ్లిన సమయంలో ఎల్లప్ప అనే వ్యక్తి బాలికతో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు.ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనంతపురం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టంతో పాటు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.విచారణలో గతంలో కూడా బాలికతో నిందితుడు అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చినట్లు డిఎస్పి పేర్కొన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

### పాఠశాల భద్రతపై దర్యాప్తు

ఘటనకు సంబంధించి పాఠశాలలో భద్రతా ఏర్పాట్లు, విద్యార్థుల పర్యవేక్షణ తదితర అంశాలపై కూడా పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు సమాచారం. విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించడంలో పాఠశాల యాజమాన్యం తీసుకున్న చర్యలను కూడా పరిశీలించిన పోలీసులు .

### బాలికల భద్రతపై అవగాహన అవసరం

చిన్నారులు, విద్యార్థినుల భద్రతపై పోలీసులు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గుడ్ టచ్--బ్యాడ్ టచ్, అనుమానాస్పద ప్రవర్తనను గుర్తించడం, ఇబ్బందికర పరిస్థితుల్లో ఎవరిని సంప్రదించాలి వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.అదేవిధంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు తదితర ప్రాంతాల్లో శక్తి బృందాల ద్వారా మహిళలు, బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. చిన్నారులు ఎలాంటి ఇబ్బందిని ఎదుర్కొన్నా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

# కార్యకర్తలే మన బలం..

- ఎన్ని అడ్డంకులు వచ్చినా వెనక్కి తగ్గేది లేదు
- జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి
- బనగానపల్లె వైసీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం



**బనగానపల్లె - సూర్య వాస్తవం:** బనగానపల్లె జి ఎస్ ఎస్ కన్వెన్షన్ హాల్ నందు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వైయస్ఆర్ సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి మాట్లాడుతూ..రాబోయే ఎన్నికల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుదాం. 40 ఏళ్ల రాజకీయ అనుభవంతో చెబుతున్నా రాబోయే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలి, ఈ ఎన్నికల్లో మనం ప్రధానంగా రెండు విషయాలను ఎదుర్కోవాలి. ఒకటి తెలుగుదేశం పార్టీ చేసే రాజకీయ కుయుక్తులు, ప్రలోభాలు. రెండోది పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని మనపై చేసే ఒత్తిళ్లు. అవసరమైతే న్యాయపరంగా కూడా పోరాడి వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి. దివంగత మహానేత వైయస్ఆర్ రాయలసీమ అభివృద్ధి, సాగునీటి కోసం జీవితాంతం పోరాడారు. గోరకల్లు, హంద్రీ-నీవా వంటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన పాత్ర ఎంతో కీలకం. రాయలసీమకు నీరు అందించాలనే లక్ష్యంతో ఆయన చేసిన కృషిని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు. అందుకే ఈరోజు రాయలసీమ ఇరిగేషన్ గురించి మాట్లాడుతున్న టీడీపీ నాయకులు గతంలో ఏం చేశారో ప్రజలకు చెప్పాలి. ప్రజలే మన బలం.కార్యకర్తలే మన బలం. ఎన్ని అడ్డంకులు వచ్చినా వెనక్కి తగ్గేది లేదు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో ప్రతి వార్డులో పార్టీని బలోపేతం చేసి, ఐక్యంగా పనిచేసి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేద్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపి రెడ్డి కాటసాని తిరుపాలు రెడ్డి భూమా కిషోర్ రెడ్డి కాటసాని ప్రసాద్ రెడ్డి మైనారిటీ నాయకులు, సిఇసి.ఎసి ఈ సి సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాల నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.




# ఏకరూప హెయిర్ కటింగ్ - క్రమశిక్షణకు ప్రతీక




**పగిడ్యాల- సూర్య వాస్తవం:** నంద్యాల జిల్లా పగిడ్యాల ఏ.పీ. మోడల్ స్కూల్‌లో విద్యార్థుల్లో క్రమశిక్షణ పరిశుభ్రత సమానత్వం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 50 మందికి పైగా విద్యార్థులకు ఏకరూప హెయిర్ కటింగ్ చేయించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ సలీం భాష మరియు పీజీటీ -- జూలోజి డా. కె. వెంకటరమణయ్య, ప్రకాశం, విశ్వేశ్వరయ్య, శివ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు శుభ్రమైన ఏకరూ పమైన హెయిర్ కటింగ్‌తో ఉండటం ద్వారా పాఠశాల నియమాలు క్రమశిక్షణ పరిశుభ్రత, సమయపాలన, సమానత్వం పట్ల అవగాహన పెరుగుతుందని తెలిపారు. క్రమశిక్షణతో కూడిన విద్యార్థి జీవితం విద్య పట్ల మరింత శ్రద్ధను పెంపొందించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని వివరించారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రత, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం పాఠశాల ప్రధాన లక్ష్యాలలో ఒకటని తెలిపారు.ఏకరూప హెయిర్ కటింగ్ -- ఏకరూప క్రమశిక్షణ -- ఉన్నత విద్యాభివృద్ధి. క్రమశిక్షణ మా లక్ష్యం అంటున్న ఉపాధ్యాయులు.

# ప్రపంచ పరిశుభ్రత దినోత్సవంపై అవగాహన



**పగిడ్యాల - సూర్య వాస్తవం:** నంద్యాల జిల్లా పగిడ్యాల మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం (గ్లోబల్ హ్యాండవాషింగ్ డే ) సందర్భంగా విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. కోలాల వెంకటరమణయ్య విద్యార్థులకు చేతుల పరిశుభ్రతప్రాముఖ్యతను వివరించారు. భోజనం చేయడానికి ముందు మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత పాఠశాల కార్యకలాపాల అనంతరం ఇతర ముఖ్యమైన సందర్భాల్లో సబ్బుతో చేతులను సక్రమంగా కడుక్కోవడం ద్వారా అనేక అంటువ్యాధులను నివారించవచ్చని తెలిపారు.చేతుల పరిశుభ్రతను ప్రతిరోజూ పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, ప్రతి విద్యార్థి చేతులు శుభ్రంగా కడుక్కోవడాన్ని తమ దైనందిన జీవితంలో ఒక మంచి అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సలీం భాష సైన్స్ ఉపాధ్యాయులు రామ్మోహన్ రెడ్డి, రవి కుమార్ విజయలక్ష్మి చందన కిరణ్మయి తదితర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజం కోసం మాస్ అవేర్‌నెస్ ర్యాలీ




**ఆత్మకూరు - సూర్య వాస్తవం :** ఆత్మకూరులో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా అనంతపురము జిల్లా ఈగల్ సెల్ ఆధ్వర్యంలో ఆత్మకూరు టౌన్‌లో ఈరోజు మాస్ అవేర్‌నెస్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అనంతపురము జిల్లా ఈగల్ సెల్ సబ్-ఇన్‌స్పెక్టర్ బి. హనుమంతు, ఆత్మకూరు పోలీస్ స్టేషన్ సబ్-ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ రావు, పోలీస్ సిబ్బంది, 5 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రజలకు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సందేశం అందించారు. అలాగే మాదకద్రవ్యాల విక్రయం, వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. 'డ్రగ్స్ వద్దు -- ఆరోగ్యకరమైన భవిష్యత్తు ముద్దు" అనే నినాదంతో ర్యాలీ నిర్వహించి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుల పంపిణీ

**ఈ నెల 12న శ్రీ సీతారామాంజనేయ దేవస్థానంలో మహా కార్యక్రమం...!**

**విగ్రహాలు కావాల్సిన భక్తులు పేర్లు నమోదు చేసుకోవాలి.ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము**



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** ఏడుకొండల వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో చేపడుతున్న సేవా కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగు తున్నాయని ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము తెలిపారు. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న ఉచిత మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. వినాయక విగ్రహాలు కావాల్సిన భక్తులు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమం ఈ నెల 12వ తేదీ శనివారం ఉదయం 10:30 గంటలకు శ్రీ సీతారామాంజనేయ దేవస్థానం, శ్రీనివాస్ నగర్, అనంతపురంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

**విగ్రహాల కోసం సంప్రదించాల్సిన నంబర్లు:**

ప్రకాష్: 90322 18426, అనిల్: 96185 71210, ప్రసాద్: 94407 60164. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము, సెల్: 98494 13713 ఆలయ కమిటీ సభ్యులు, శ్రీవారి సేవకులు ఆళ్లగడ్డ రాము కోరారు.

## జైన్ పాఠశాలలో పట్టణ పోలీసుల అవగాహన సద స్సు



**కదిరి - సూర్య వాస్తవం :** యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థి దశలోనే వారి జీవితం గంజాయి , డ్రగ్స్ బారిన పడకుండా డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలోని జైన్ పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల కు బానిస అవుతూ వారి బంగారు భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మద్యం, మత్తు పదార్థాలు వల్ల విచక్షణ కోల్పోయి రోడ్డు ప్రమాదాలకు గురవుతూ వారు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు, యువత మాదక ద్రవ్యాల అవగాహన కల్పిస్తూ అత్యవసర సమయాల్లో పోలీసు సేవలు కోసం ఉపయోగించవలసిన 100, 112 సేవల గురించి అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో జైన్ పాఠశాల హైస్కూల్ కోఆర్డినేటర్ కరే బాలాజీ, ప్రైమరీ కోఆర్డినే టర్, భాగ్యలక్ష్మి సీనియర్ మేనేజర్ సరస్వతి, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు

## ఎస్టీ కమిషనర్ ఛైర్మన్‌కు బిజెపి మండలాధ్యక్షుడు తేనేటివిందు

**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి మండల బీజేపీ అధ్యక్షుడు చౌహాన్ అంజినాయక్ ఆహ్వానం మేరకు పామిడిలోని ఆయన స్వగృహంకు వెల్లిన రాష్ట్ర ఎస్టీ కమిషనర్ ఛైర్మన్ సొల్ల బుచ్చిరెడ్డిని ఘనంగా సత్కరించి తేనేటివిందు ఇచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సొల్లా బుచ్చిరెడ్డి,రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప, కే. మహేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం గిరిజనులు ఎదుర్కొం టున్న సమస్యలు, వారి హక్కులు సంక్షేమం, అభివృద్ధికి సంబం ధించిన పలు అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో చౌహాన్ రంజిత్ నాయక్, బీజేపీ ఎస్టీ మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ మిట్ట రాజా, బీజేపీ సింగనమల , వెంకటేష్ నాయక్, మురళి నాయక్,చాణిక్య తదితరులు పాల్గొన్నారు.



# ఆకాశాన్నంటుతున్న ధరలు - మండుతున్న వంటిళ్లు

- ప్రజలపై ధరల భారాన్ని మోపుతున్న పాలకులు
- ఎల్‌నినో పేరుతో పెంచిన నిత్యావసర ధరలను నియంత్రించాలి
- ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలి
- పేద, మధ్య తరగతి ప్రజలను ధరల దోపిడీ నుండి ప్రభుత్వమే రక్షించాలి





**రాయదుర్గం- సూర్య వాస్తవం :** ప్రజలపై ధరల భారాలను మోపుతున్న కేంద్ర, రాష్ట్ర పాలకుల విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా అనంతరం రాయదుర్గం తహసీల్దార్ కి వినతిపత్రం అందజేసినట్లు రాయదుర్గం నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున తెలిపారు. ఈ మేరకు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో 2014 నుంచి 2026 వరకు నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. ప్రజల ఆదాయాలకు మించి నిత్యావసరాల ధరలు పెరుగుతూ, పేద, కార్మిక, రైతు, చిరు వ్యాపారి, మధ్యతరగతి కుటుంబాలపై పెనుభారాన్ని మోపుతున్నాయి. బియ్యం, కందిపప్పు, మినపప్పు, పెసరపప్పు, శనగపప్పు వంటి పప్పుధాన్యాల ధరలు విపరీతంగా పెరిగాయి. వంట నూనె, పాలు, చక్కెర, ఉప్పు ధరలు సైతం మండిపోతున్నాయి. కూరగాయల ధరలు చూస్తే.. సామాన్యుడికి ప్రతిరోజూ ఒక కొత్త షాక్ ఎదురవుతోంది. ఇది సాధారణ ధరల పెరుగుదల కాదు. ప్రజల జీవనంపై జరుగుతున్న ఆర్థిక దాడి. ఒకవైపు వంటింట్లో మంటలు మండుతుంటే, మరోవైపు సామాన్యుడి జేబులో చిల్లిగవ్వ లేకుండా పోతోంది. కార్మికుడి కూలి పెరగడం లేదు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడం లేదు. బియ్యం కిలో ధర రూ. 73కు ఎగబాకడంతో సామాన్యుడి కుటుంబ బడ్జెట్ మరింత భారంగా మారింది. అందే సరుకు తక్కువ ధరకు అందడం లేదు. రైతు పొలంలో పంటకు తక్కువ ధర, మార్కెట్ లో వినియోగదారుడికి ఎక్కువ ధర, ఈ రెండు ధరల మధ్యలో దళారులు, నిల్వదారులు, కార్పొరేట్ వ్యాపార వర్గాల వ్యవస్థ బలపడుతోంది. రైతు శ్రమకు న్యాయం జరగాలన్నా, సామాన్యుడికి అందుబాటు ధరలు రావాలన్నా, నల్లబజారు, అక్రమ నిల్వలు, దళారీ దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల కూడా ప్రతి కుటుంబంపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతోంది. 2014 ఏప్రిల్ లో ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ.72.26, డీజిల్ ధర రూ.55.49 ఉండగా, 2026 సెప్టెంబర్ లో ఢిల్లీలో పెట్రోల్ రూ.102.12, డీజిల్ రూ.95.20కు చేరాయి. ఇంధన ధరల పెరుగుదల కేవలం వాహనదారుల సమస్యగా పరిమితం కావడం లేదు. రవాణా ఖర్చులు, వ్యవసాయ పెట్టుబడులు పెరిగి చివరకు ప్రతి నిత్యావసర వస్తువుపై దాని ప్రభావం పడుతోంది. గ్యాస్ ధరలు ప్రతి వంటింటికీ భారంగా మారాయి. ఈ ధరల దోపిడీకి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. నల్లబజారు, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, దళారీ వ్యవస్థను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఈ నేపథ్యంలో నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని; బియ్యం, పప్పులు, వంటనూనెలు, పాలు, చక్కెర తదితర నిత్యావసర వస్తువులను చౌక ధరలకు ప్రజలకు అందించాలని; నల్లబజారు, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతను అరికట్టాలని; ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని; పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని; రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని; దళారీ వ్యవస్థ, నిల్వదారుల దోపిడీని అరికట్టాలని; ప్రజల కొనుగోలు శక్తిని పెంచాలని సీపీఐ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నది.

ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా ఏఐవైఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కావలి కోట్రేష్, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి తిప్పేస్వామి, రాయదుర్గం పట్టణ కార్యదర్శి రవీంద్రనాథ్, రాయదుర్గం సీపీఐ మండల ఇన్చార్జి దుర్గన్న, సీపీఐ నాయకులు అంజప్ప, అజయ్, మంజు, అశోక్, సిద్ధ, మరెన్న తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

**- ఎస్పీ పి. జగదీష్**

**- పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి సువర్ణావకాశం**

**- రాజీ పడదగిన క్రిమినల్, సివిల్ కేసులకు పరిష్కారం**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా ప్రజలందరూ సద్విని యోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ కోరారు. పోలీస్ స్టేషన్లు, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ చలాన్లు, సివిల్ కేసులను లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్‌లో వెలువడే తీర్పు కోర్టు తీర్పుతో సమానమైనదని పేర్కొన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారంతో సమయం,డబ్బు ఆదా కావడంతో పాటు ఉభయ పక్షాల మధ్య సత్సంబంధాలు మెరుగుపడతాయని ఎస్పీ తెలిపారు. కేసులను త్వరితగతిన పరిష్కరించుక ోవాలనుకునే వారు సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు.

## బ్రైటర్ మైండ్స్ కార్యక్రమం అమలుపై అధికారుల సమీక్ష...!

**- విద్యార్థుల మానసిక సామర్థ్యాలు, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపే లక్ష్యం**

**- అమలులో సమస్యలు.. పరిష్కార మార్గాలపై చర్చ- జిల్లా నోడల్ అధికారి భాస్కర్**



**అనంతపురం - సూర్య వాస్తవం :** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) విద్యార్థుల మానసిక సామర్థ్యాలు, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, సృజనాత్మకతను పెంపొందించే లక్ష్యంతో అమలు చేస్తున్న బ్రైటర్ మైండ్స్ కార్యక్రమం అమలు తీరుపై బుధవారం కొర్రపాడు రీజినల్ ట్రైనింగ్ సెంటర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. కేజీబీవీల బ్రైటర్ మైండ్స్ జిల్లా నోడల్ అధికారి భాస్కర్, ఎస్పీడీ కార్యాలయ జీసీడీఓ సుధాలక్ష్మి కార్యక్రమం అమలు తీరును సమీక్షించారు. విద్యార్థులతో కార్యక్రమంలోని కార్యకలాపాలను క్రమం తప్పకుండా నిర్వహించడం, వారి భాగస్వామ్యాన్ని పెంచడం, కార్యక్రమం ద్వారా సాధిస్తున్న ప్రగతిని నిరంతరం పర్యవేక్షించడం వంటి అంశాలపై చర్చించారు. ప్రతి విద్యార్థికి బ్రైటర్ మైండ్స్ కార్యక్రమం ద్వారా ప్రయోజనాలు అందేలా సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమం అమలులో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఏపీసీ శైలజ, జీసీడీఓ కవిత మాట్లాడుతూ.. కేజీబీవీ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, సృజనాత్మక ఆలోచనా విధానం, అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంలో బ్రైటర్ మైండ్స్ కార్యక్రమం కీలకంగా దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల్లో మెరుగైన అభ్యసన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కృష్ణానాయక్‌కు ఘన సన్మానం



**కాలువపల్లి- సూర్య వాస్తవం:** బెలుగుప్ప మండలం కాలువపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బి. కృష్ణానాయక్ 2026 సంవత్సరానికి 'ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు'కు ఎంపికైన సందర్భంగా పాఠశాలలో ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయురాలు ఎం. ఉషారాణి అధ్యక్షతన మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కమిటీ ఛైర్మన్ బి. రాధాకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, కమిటీ ఛైర్మన్ రాధాకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధి, ఉజ్వల భవిష్యత్తు కోసం కృష్ణానాయక్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆయన సేవలను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయడం పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం కృష్ణానాయక్‌ను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. తన సేవలను గుర్తించి సన్మానించిన పాఠశాల యాజమాన్యానికి, కమిటీ సభ్యులకు, తోటి ఉపాధ్యాయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని కృష్ణానాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## పాము కాటుకు రైతు మృతి



**బెలుగుప్ప - సూర్య వాస్తవం :** వేరుశనగ పంట పీకుతుండగా విషసర్పం కాటువేయడంతో ఓ రైతు మృతి చెందిన ఘటన బెలుగుప్ప మండలం దుద్దేకుంట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కురుబ పుల్లయ్య (69), స్వర్గీయ హనుమంతప్ప కుమారుడు, తనకున్న మూడు ఎకరాల పొలంలో వేరుశనగ పంట సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో తన కుమారుడు లక్ష్మీనారాయణతో పాటు మరో పది మంది కూలీలతో కలిసి పొలంలో వేరుశనగ పంట పీకు తున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని విషసర్పం పుల్లయ్య ఎడమ చేతి మధ్య వేలికి కాటు వేసింది. పుల్లయ్య గట్టిగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న కుమారుడు లక్ష్మీనారాయణ, అన్న కుమారుడు రఘు వెంటనే మోటార్‌సైకిల్‌పై ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా పుల్లయ్య మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెలుగుప్ప పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎస్.కె. శివశంకర్ నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# టీడీపీ కార్యకర్త చిన్న మారెప్ప మృతి

### - కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించిన టీడీపీ నాయకులు



**బెలుగుప్ప- సూర్య వాస్తవం:** టీడీపీ కార్యకర్త చిన్న మారెప్ప (66) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, పార్టీ కార్యకర్తల్లో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ సునీల్, జయరాములు, ఉమాపతి, రమేష్, సంజీవ రాయుడు, మాజీ సర్పంచ్ భూపతి తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు చిన్న మారెప్ప కుటుంబాన్ని పరా మర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఆర్థిక సహాయం అందించారు. చిన్న మారెప్ప కుటుంబానికి పార్టీ తరఫున అండగా ఉంటామని నాయకులు భరోసా ఇచ్చారు. మృతుడి భార్య వన్నూరుక్కతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. చిన్న మారెప్ప మృతికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

# వినాయక చవితి వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి...

### - అలజడి సృష్టిస్తే సహించేది లేదు.....
### - మంటపానికి ఆన్లైన్ తప్పనిసరి అనుమతి పొందాలి...
### - అర్బన్ సీఐ దేవానంద్



**రాయదుర్గం - సూర్య వాస్తవం :** వినాయక చవితి పండుగను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అర్బన్ సీఐ దేవానంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఐ దేవానంద్ మాట్లాడుతూ... జిల్లా ఎస్పీ జగదీష్ వినాయక ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గట్టి బంధవ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పట్టణంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి అలజడి సృష్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే పరిస్థితి లేదని సిఐ హెచ్చరించారు. మంటపానికి ఆన్లైన్లో తప్పనిసరిగా అనుమతి పొందాలని, మంటపం దగ్గర రోజుకు 24 గంటలు భద్రతగా ఉండే విధంగా కమిటీ సభ్యులు ఉండాలని సిఐ పేర్కొన్నారు. ప్రజలందరూ ఐక్యమత్యంతో వినాయక ఉత్సవాలు జరుపుకోవాలని, ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ప్రజలకు సీఐ దేవానంద్ విజ్ఞప్తి చేశారు. వినాయక చవితి పండుగ సందర్భంగా పట్టణంలో అరాచకాలకు అలజడలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని సిఐ హెచ్చరించారు. నిమగ్నం రోజు ట్రాఫిక్ లో ఎలాంటి అంతరాయం కలగకుండా పోలీస్ సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన పేర్కొన్నారు. పట్టణంలోని బళ్లారి రోడ్ వినాయక సర్కిల్ లక్ష్మీ బజార్ తదితర ప్రాంతాలలో ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా నిమజ్జ కార్యక్రమాన్ని సజావుగా జరుపుకోవాలని వినాయక ట్రస్ట్ మెంబర్లకు సీఐ సూచించారు. మండపాల వద్ద డీజే లు అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, భక్తి గీతాలతో మంటపాల దగ్గర ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రతి ఒక్కరు మెలగాలని సిఐ సూచించారు. మంట పాల దగ్గర మహిళలకు గౌరవపదంగా మాట్లాడాలని సీఐ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి.....

### - తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి...!
### - ప్రజల గొంతుకగా నిలిచి సమస్యలపై పోరాడుతాం

**అనంతపురం - సూర్య వాస్తవం :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమాయత్తం కావాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. శ్రీ సత్యసాయి జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. త్వరలో మున్సిపల్ ఎన్నికలు, అనంతరం పంచాయతీ, ఎంపిటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎన్నికల సమరానికి సిద్ధం చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్, రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్, రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వివిధ నియోజకవర్గాల సమన్వయకర్తలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల పోరాటానికి కార్యకర్తలను సిద్ధం చేయడానికే సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి వైఎస్సార్‌సీపీ విధానాలను, ప్రజా సమస్యలపై పార్టీ చేస్తున్న పోరాటాన్ని వివరించాలని సూచించారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న తమపై కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. తమ ముగ్గురు సోదరులపై 18 కేసులు పెట్టినా ప్రజల తరఫున ప్రశ్నించడం, ప్రజల్లో తిరగడం ఆపలేదన్నారు. ప్రజల గొంతుకగా నిలిచి సమస్యలపై పోరాడటం తమ హక్కు అని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు వైఎస్సార్‌సీపీకి అత్యంత కీలకమని, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాబోయే ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ ఛైర్మన్లు పార్టీకి రథసారథులుగా నిలవాలని కోరారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ఎన్ని కేసులు నమోదైనా ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగుతుందని ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సత్తా చాటేలా ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.



# 50 ఏళ్లకే మత్స్యకారులకు పించన్ ఇవ్వాలి

- కె.వి. రమణ, మాజీ డైరెక్టర్,...!
- ధ్రువీకరణ పత్రాలకు సెల్ఫ్ డిక్లరేషన్‌కు అవకాశం కల్పించాలి
- దరఖాస్తుల గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగించాలి
- బెస్త సంఘాల ధ్రువీకరణను కూడా పరిగణనలోకి తీసుకోవాలి



**అనంతపురం - సూర్య వాస్తవం :** కరువుకు నిలయమైన రాయలసీమ ప్రాంతంలో నీటి వనరులు లేక సాంప్రదాయ మత్స్యకారుల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటోందని, వయసు పైబడిన మత్స్యకారులు సొంత ఆదాయ వనరులు లేక దుర్భర జీవితాలు గడుపుతున్నారని బెస్త కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కె.వి. రమణ ఆవేదన వ్యక్తం చేశారు. 60 సంవత్సరాలు దాటిన ప్రతి సాంప్రదాయ మత్స్యకారుడికి వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా మత్స్య సహకార సంఘాల్లో సభ్యత్వం ఉన్నవారికి, ఫిషర్మెన్ లైసెన్సులు పొందిన వారికి 50 సంవత్సరాల వయసు నుంచే పింఛన్ అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం కొత్త పింఛన్ల కోసం సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తున్న నేపథ్యంలో, గ్రామీణ ప్రాంతాల్లోని చదువురాని, పేద సాంప్రదాయ మత్స్యకారులు దరఖాస్తు చేసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందువల్ల దరఖాస్తుల గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగించాలని కోరారు.

**ధ్రువీకరణ పత్రాలతో పేదలకు ఇబ్బందులు**

పింఛన్ దరఖాస్తుకు ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యుల ఆధార్, ఇంటి పన్ను రసీదు, ఫోటోలు, సంబంధిత విభాగాల గుర్తింపు కార్డులతో పాటు మత్స్య సహకార సంఘ సభ్యులు, ఫిషర్మెన్ లైసెన్స్ పొందిన వారు మత్స్యశాఖ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి రావడం పేదలకు భారంగా మారిందని రమణ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే 60 ఏళ్లకు పైబడిన మత్స్యకారులు ధ్రువీకరణ పత్రాల కోసం జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి రావడంతో సమయం, డబ్బు వృథా అవుతోందన్నారు.

**సెల్ఫ్ డిక్లరేషన్‌కు అవకాశం కల్పించాలి**

ధ్రువీకరణ పత్రాల విషయంలో సెల్ఫ్ డిక్లరేషన్ విధానాన్ని అమలు చేయాలని, దానిని బలపరిచేందుకు బెస్త సేవా సంఘాల ధ్రువీకరణను కూడా అనుమతించాలని కోరారు. అవసరమైతే గ్రామ, వార్డు సచివాలయ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి అర్హతను నిర్ధారించే అవకాశం కల్పించాలని సూచించారు. మత్స్య సహకార సంఘాల సభ్యులు, ఫిషర్మెన్ లైసెన్స్ ఉన్నవారు మత్స్యశాఖ ధ్రువీకరణ కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన నిబంధనను తొలగించి, ఆయా మండలాలకు బాధ్యత వహించే ఎఫ్‌డీఓలకు అర్హతను నిర్ధారించే అధికారాలు కల్పించాలని కోరారు.

**ఇంటి పన్ను రసీదు నిబంధన తొలగించాలి**

ఇంటి పన్ను రసీదు సమర్పించాలనే నిబంధనను కూడా తొలగించాలని కె.వి. రమణ డిమాండ్ చేశారు. అర్హులైన అనేక మంది సాంప్రదాయ మత్స్యకారులకు సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లలో నివసిస్తున్నారని, అలాంటి వారికి ఇంటి పన్ను రసీదు లేకపోవడంతో పింఛన్‌కు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. పేద సాంప్రదాయ మత్స్యకారుల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నిబంధనలను సరళీకరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కె.వి. రమణ కోరారు.

# సమస్యల పరిష్కారమే... ఎస్టీ కమిషన్ లక్ష్యం...!

- గిరిజనుల సమస్యలపై ప్రత్యేక దృష్టి
- తాగునీరు, రోడ్లు, భూ వివాదాలు, విద్యా సంస్థల్లో మౌలిక వసతులపై ఫిర్యాదులు
- అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే అధికారులపై చర్యలు తప్పవు
- రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సొల్ల బొజ్జి రెడ్డి



**అనంతపురం - సూర్య వాస్తవం :** రాష్ట్రంలోని గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయడమే రాష్ట్ర ఎస్టీ కమిషన్ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సొల్ల బొజ్జి రెడ్డి తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ గిరిజన తండాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటున్నామని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి, నల్లచెరువు, ముదిగుబ్బ మండలాల్లో పర్యటించిన సందర్భంగా తండావాసులు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ప్రధానంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, బోర్లు వేసినా భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో నీటి కొరత ఏర్పడుతోందని తెలిపారు. తండాలకు రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు సరిగా లేవని ప్రజలు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని గిరిజనులు కోరుతున్నారని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా సకాలంలో వర్షాలు లేక పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని, కూలీలకు కూడా ఉపాధి సమస్యలు ఎదురవుతున్నాయని గిరిజనుల నుంచి అర్జీలు అందినట్లు చెప్పారు. ఆయా ప్రాంతాలను కరువు జిల్లాలుగా ప్రకటించి ఆదుకోవాలని వారు కోరినట్లు తెలిపారు. భూ వివాదాలు, పట్టాల మంజూరులో నిరుపేద గిరిజన కుటుంబాలకు అన్యాయం, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, స్మశాన వాటికలు లేకపోవడం, అక్రమ కేసుల సమస్య తదితర ఫిర్యాదులు కూడా తమ దృష్టికి వచ్చినట్లు ఛైర్మన్ వెల్లడించారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న నిధులు సక్రమంగా వినియోగం కావాలని, అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అర్హులైన ప్రతి గిరిజనుడికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్టీ కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎస్టీ కమిషన్ క్షేత్రస్థాయిలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు అర్హులకు అందుతున్నాయా లేదా అనే అంశాలను పరిశీలిస్తోందన్నారు.

అర్హులకు అన్యాయం జరిగినట్లు రుజువైతే బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గిరిజన విద్యా సంస్థల నిర్వహణ, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరో సభ్యుడు కె. మల్లేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిపై తక్షణమే స్పందిస్తూ పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

అంతకుముందు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజన ప్రజల నుంచి ఎస్టీ కమిషన్ బృందం పలు సమస్యలతో కూడిన అర్జీలను స్వీకరించింది. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీవో ప్రేమాంత్ కుమార్, డీటీడబ్ల్యూ శ్రీనివాసరావు, అర్బన్ తహసీల్దార్ డి. రాజా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తేజ తదితరులు పాల్గొన్నారు.

# జగన్ పరిపాలనలో భూహక్కుల చట్టం వల్ల రైతులకు అనేక అనుమానాలు....

- రైతుల పాస్ పుస్తకాలపై జగన్ ఫోటోలు విడ్డూరం...
- మరో 15 సంవత్సరాలు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండేలా రాష్ట్ర ప్రజలు జీవించాలి.
- జగన్ తుగ్లక్ పాలనకు రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే
- రాజముద్రతో పాస్‌పుస్తకాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాలవ



**రాయదుర్గం - సూర్య వాస్తవం :** జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ హక్కుల చట్టం వల్ల రైతులు అనేక అనుమానాలు, ఆందోళనలకు గురయ్యారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. డి.హీరేహాల్ మండలం నాగలాపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... గ్రామాల్లో చాలా సమస్యలకు భూ వివాదాలే ప్రధాన కారణం అవుతున్నాయన్నారు. వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన భూ నల్ల చట్టం వల్ల తమ భూములపై పూర్తి హక్కులు తమకే ఉన్నాయా..? భూ వివాదాలు తలెత్తితే ఎవరిని ఆశ్రయించాలి..? అనే అయోమయం నెలకొన్నదన్నారు. రైతుల అభిప్రాయాలను, భూమిపై వారి హక్కు, భద్రతను పరిగణనలోకి తీసుకోకుండా రూపొందించిన ఆ చట్టాన్ని చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే రద్దు చేసి రైతులకు న్యాయం చేసిందని తెలిపారు. రైతుల భూములపై వారికి సర్వ హక్కులను కల్పించడంతో పాటు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. పాస్ పుస్తకాలు రైతుల భూమి యాజమాన్య హక్కులకు అధికారిక ఆధారంగా నిలుస్తాయని, భవిష్యత్తులో భూముల క్రయ విక్రయాలు, రుణాల పొందడం, వారసత్వ బదలాయింపులు వంటి అంశాల్లో రైతులకు ఉపయోగపడతాయని వివరించారు. భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, ఖచ్చితత్వం, భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. భూముల వివరాలను సక్రమంగా నమోదు చేయడం, రైతులకు అవసరమైన ధ్రువపత్రాలను సకాలంలో అందించడం వంటి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. భూములకు సంబంధించిన సమస్యలను అధికారులు వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనునిత్యం రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు శ్రమిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయనకు మద్దతుగా నిలుస్తూ తమ సంపూర్ణ సహకారాన్ని అందించాలన్నారు. ఆయన పాలనలోని రాష్ట్రం అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు కనుకనే గత ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారన్నారు. సంక్షేమం అభివృద్ధితో పాటు శాంతి భద్రతలకు చంద్రబాబు నాయుడు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఎవరి పనులు వారు స్వేచ్ఛగా చేసుకోవడానికి వీలవుతుందన్నారు. చంద్రబాబు ఉంటేనే అభివృద్ధి ఆయన ఉంటేనే సంక్షేమం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి కూటమి ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందించాలని ఎమ్మెల్యే కాలవ కోరారు. రాష్ట్రంలో మరో 15 సంవత్సరాల పాటు చంద్రబాబు పాలన కొనసాగేలా నిండు మనసుతో అందరూ ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనుమంత రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాగలి రాజు, టిడిపి మండల కన్వీనర్ మోహన్ రెడ్డి, టిడిపి నాయకులు శ్రీరాములు, గోవింద, మొండి మల్లికార్జున, మల్లికార్జున గౌడ్, వెంకటేష్, బుజ్జి, మాకాసి వెంకటేష్, దొడగట్ట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# యోగా నిత్య జీవన విధానంగా మారాలి

- ప్రిడిక్టివ్,ప్రివెంటివ్,వెల్‌నెస్ విధానంతో ఆరోగ్యకర సమాజ నిర్మాణం
- రెండేళ్లలో ఆయుష్ అభివృద్ధికి రూ.435 కోట్లు.. 150 కొత్త డిస్పెన్సరీలు..
- "రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్"





**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** ధర్మవరం,:-యోగా ఒకరోజు కార్యక్రమానికి పరిమితం కాకుండా నిత్య జీవన విధానంగా మారాలని రాష్ట్ర వైద్య,ఆరోగ్య,కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి,సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు.అనారోగ్యం వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే ముందుగానే వ్యాధులను గుర్తించి నివారించే ప్రిడిక్టివ్,ప్రివెంటివ్,వెల్‌నెస్ విధానానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు.ధర్మవరం పట్టణం లోని మున్సిపల్ కాంప్లెక్స్ టెర్రస్‌పై ధర్మవరం యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సింధూర్ నిత్య ధ్యాన యోగ సాధన మందిరాన్ని బుధవారం యోగా గురువు భీష్మయ్యతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం జరిగిన యోగా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దాదాపు మూడున్నర దశాబ్దాలుగా యోగా సాధన చేస్తూ, పలువురు సాధకులను తయారు చేస్తున్న గురూజీ భీష్మయ్యను మంత్రి అభినందించారు.యోగా మందిరం ఎంతో ప్రశాంతమైన అనుభూతిని కలిగిస్తోందన్నారు. భారతీయ సంస్కృతిలో యోగా, ప్రాణాయామం, ఆయుర్వేదానికి వేల సంవత్సరాల



ఘనమైన వారసత్వం ఉందని పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ కృషితో యోగా ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందన్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయవచ్చని తెలిపారు. రాష్ట్రంలో యోగాను ఇంటింటికీ తీసుకెళ్లేలా చర్యలు చేపడు తున్నామని, గ్రామ,వార్డు సచివాలయాల స్థాయిలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు,అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులను భాగస్వాములను చేస్తు న్నామని చెప్పారు.ధర్మవరం పట్టణంలో ఇప్పటికే సుమారు 13 యోగా కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. అంతేకాకుండా ఆయుష్ వైద్య విధానాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్య మిస్తోందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. 2014--2024 మధ్య రాష్ట్రంలో ఆయుష్ రంగానికి సుమారు రూ.109 కోట్లు ఖర్చు కాగా.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో సుమారు రూ.435 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. డిస్పెన్సరీలను ఆధునీకరించడంతో పాటు 150 కొత్త డిస్పెన్సరీలను ప్రారంభించినట్లు తెలిపారు.ధర్మవరం ప్రాంతానికి ఆయుర్వేద మెడికల్ కాలేజీ మంజూరైందని, ప్రస్తుతం టెండర్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. గుంటూరు సమీపంలో రూ.100 కోట్లతో సెంట్రల్ రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆన్ యోగా అండ్ నేచురోపతి ఏర్పాటుకు కేంద్రం నిధులు మంజూరు చేసిందని,త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.అశ్వగంధ, తిప్పతీగ,మునగాకు,ఉసిరి వంటి ఔషధ మొక్కల ప్రాధాన్యాన్ని ప్రజలు గుర్తించాలని సూచించారు. ఔషధ మొక్కల సాగును రైతుల్లో ప్రోత్సహిస్తున్నామని, తద్వారా ఆరోగ్య పరిరక్షణతో పాటు రైతులకు ఆదాయ అవకాశాలు కూడా పెరుగుతాయని చెప్పారు"ఆరోగ్యం ఉంటేనే సంపద, సంతోషం.యోగా కేవలం వ్యాయామం కాదు.. ఆరోగ్యకరమైన జీవన విధానం.ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి"అని మంత్రి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాంభూపాల్‌రెడ్డి,యోగా అసో సియేషన్ అధ్యక్షుడు గాజుల సోమేశ్వర్‌రెడ్డి,జిల్లా క్రీడల అధికారి కిషోర్, సత్రసాల ప్రసన్నకుమార్, బంధనాతం సూర్యప్రకాష్, ఓంశాంతి సిస్టర్ రాధమ్మ,కట్టా రవి కుమార్, కోనాపురం సాయిప్రసాద్,ఈశ్వరయ్య,పవన్ నాయక్,యోగా గురువులు,సాధకులు,పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## నిర్మాణం పూర్తయిన ప్రారంభం నోచుకోని పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనం




**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** ప్రభుత్వ భవనాలను ప్రజా ప్రయోజనాల నిమిత్తం ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్మాణాలు పూర్తి చేస్తున్న అవి నెలల తరబడి ప్రారంభం నోచుకోక నిరుపయోగంగా నిలిచిపోతున్నాయి.వైద్య ఆరోగ్యశాఖలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుబంధంగా నిర్మించిన పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనం నేటికీ నిర్మాణం పూర్తయి ఏడాది పైబడుతున్న ఎవరికి ఉపయోగం లేక నిరుపయోగంగానే ఉంది.పెళ్లకూరు మండలంలో పూర్తి చేసుకున్న భవనం ఎప్పుడో ప్రారంభమై ప్రాథమిక ఆరోగ్య సిబ్బందికి ఉపయోగకరంగా ఉంది. అయితే దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సమీపంలో 50 లక్షల రూపాయల నేషనల్ హెల్త్ మిషన్,15 ఫైనాన్స్ నిధులతో నిర్మితమైన భవనం ప్రారంభం కాక,శిధిలావస్థకు చేరే పరిస్థితి ఏర్పడనుంది.నిర్మాణం పూర్తి చేసిన కాంట్రాక్టర్ వైద్య శాఖకు అప్పగించకపోవడమా,వైద్యశాఖ అధికారులు ప్రారంభానికి చర్యలు చేపట్టకపోవడమా ఏ కారణమో కానీ ప్రభుత్వ భవనం ఉపయోగం లో లేక,నిరుపయోగంగా ఉంది.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన 50 లక్షల నిధులు నిరుపయోగమయ్యే పరిస్థితి ఉంది.దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు భవన నిర్మాణం పూర్తయిన ప్రభుత్వపరంగా ప్రారంభించి, ఆరోగ్య సేవలకు ఉపయోగించుకోవాలనే ధోరణిలో పట్టించుకోకపోవడం,కనీసం విద్యుత్ సరఫరా కూడా చేయకపోవడంతో కూటమి ప్రభుత్వ పాలనలోపు ఈ భవన నిర్మాణం ప్రారంభం అవుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ భవనాలంటే అధికారులకు కూడా ఇంత నిర్లక్ష్యమా అనేది కూడా నిదర్శనంగా కనిపిస్తోంది.ఇలాగే ప్రారంభించకుండా భవనాన్ని ఉపయోగం లోకి తీసుకోకరాకంటే లోపలి భాగంలో వస్తు సామాగ్రి కూడా దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది.జిల్లా అధికారులైన స్పందించి ఈ ప్రభుత్వ భవన నిర్మాణం ప్రజారోగ్య సేవలకు ఉపయోగం లోకి వచ్చే విధంగా చర్యలు చేపట్టి ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## వినాయక మండపాలకు ఉచిత విద్యుత్..ఏపీ ప్రభుత్వ నిర్ణయం

- సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన మంత్రి నారా లోకేశ్
- నిర్వాహకులపై ఆర్థిక భారం తగ్గించడమే లక్ష్యమన్న ప్రభుత్వం
- కూటమి సర్కార్ నిర్ణయంపై భక్తులు,ఉత్సవ కమిటీల హర్షం
- విఘ్నేశ్వరుని ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని

ప్రతీ కుటుంబం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విజయాలతో వర్ధిల్లాలీ.."మంత్రి నారా లోకేశ్"




**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** వినాయక చవితి పండుగ సమీపిస్తున్న వేళ, ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం ఉత్సవ నిర్వాహకులకు,భక్తులకు ఒక శుభవార్త అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసే ప్రతీ గణేశ్ మంటపానికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు కీలక నిర్ణయం తీసుకుంది.ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం అధి కారి కంగా ప్రకటించారు.ఈ మేరకు నారా లోకేశ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా తన ప్రకటనను వెల్లడించారు. విద్యుత్ ఛార్జీల భారం లేకుండా,ఉత్సవ కమిటీలు,భక్తులు మరింత ఉత్సాహంగా,వైభవంగా వేడుకలు జరుపుకోవాలనే సదుద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు."ఈ వినాయక చవితికి, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న అన్ని గణేశ్ మంటపాలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని ప్రకటించడం సంతోషంగా ఉంది.రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు జరుపు కుంటున్న వారికి మద్దతుగా, వేడుకలను మరింత వైభవంగా నిర్వహించేందుకు మా ప్రభుత్వం ఈ చొరవ తీసుకుంది"అని లోకేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. సాధా రణంగా ఇప్పటివరకు ఉత్సవ కమిటీలు గణేశ్ మండ పాల కోసం తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు తీసు కోవాలంటే నిర్ణీత రుసుములు చెల్లించాల్సి వచ్చేది. అనుమతుల కోసం కూడా కొంత శ్రమించాల్సి ఉండేది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో నిర్వాహకులకు ఈ ఆర్థిక భారం, ప్రక్రియాపరమైన ఇబ్బందులు తప్పనున్నాయి. ఈ నిర్ణయం పట్ల ఉత్సవ కమిటీల నిర్వాహకులు, భక్తుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.ఈ సందర్భంగా విఘ్నేశ్వరుని ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని,ప్రతీ కుటుంబం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, విజయాలతో వర్ధిల్లాలని నారా లోకేశ్ ఆకాంక్షించారు.

## నిజం గెలిచింది.. చంద్రబాబు పోరాటం ఫలించింది!

**- 53 రోజుల నిర్బంధం..చెక్కుచెదరని చంద్రబాబు నాయకత్వం!**

**- చంద్రబాబు అరెస్టుపై 53 రోజుల పోరాటం..చివరికి గెలిచింది న్యాయమే!**



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** తెలుగుదేశం పార్టీ అధినేత,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని 2023లో స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉంచిన ఘటనను రాష్ట్ర ప్రజలు ఇప్పటికీ మరువలేదని టీడీపీ నాయకుడు దార్ల రాజేంద్ర అన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా సూళ్లూరుపేట నియోజకవర్గంలో 53 రోజుల పాటు వివిధ నిరసన కార్యక్ర మాలు నిర్వహించి ఆయనకు మద్దతుగా నిలిచామని తెలిపారు.పెద్దలు కొండేపాటి గంగాప్రసాద్ సూచనలతో,నియోజకవర్గ ఇన్‌చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు,నారా లోకేష్‌పై కేసులు,అరెస్టులు,హౌస్ అరెస్టుల పేరుతో అన్యాయం జరిగిందని దార్ల రాజేంద్ర ఆరోపించారు. సూళ్లూరుపేట నియోజక వర్గంలో కూడా టీడీపీ నాయకులు,కార్యకర్తలపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని అన్నారు.చంద్రబాబు నాయుడు అరెస్టు సమయంలో 53 రోజుల పాటు తాము ఆయనకు అండగా నిలిచామని,ఆ పోరాటంలో టీడీపీ శ్రేణులు చూపిన ఐక్యత,ప్రజల మద్దతు మరువలేనిదని తెలిపారు.చివరకు అన్యాయం ఓడిపోయి నిజం గెలిచిందని ఆయన పేర్కొన్నారు."చంద్రబాబు నాయుడు పోరాటంలో మనమంతా గెలిచాం. టీడీపీకి ప్రజల మద్దతు ఎప్పటికీ ఉంటుంది"అని దార్ల రాజేంద్ర అన్నారు.జై తెలుగుదేశం..జై చంద్రబాబు..జై నారా లోకేష్ అంటూ ఆయన నినదించారు.

## చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు

**- జగన్ హయాంలో రాక్షస పాలన సాగింది**

**- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహ యాదవ్**



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:**తిరుపతి:-చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు అయిందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు,యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ అన్నారు. బుధవారం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసిపి పాలనలో చేసిన అరాచకాలు అన్ని ఇన్ని కావని, వైయస్సార్ హయాంలో జగన్ ప్రజాధనాన్ని లూటీ చేశారని విమర్శలు గుప్పించారు.జగన్ సీఎం అయిన తర్వాత పరిపాలన రాష్ట్రంలో చాలా దారుణంగా ఉండేదని,ఇష్టానుసారంగా అక్రమ కేసులు పెట్టించి రాక్షస ఆనందాన్ని పొందారన్నారు. చంద్రబాబు పై అక్రమ కేసు పెట్టి అర్ధరాత్రి అరెస్టు చేశారని,ఈ కారణంతో 53 రోజులు జైలు జీవితం గడిపారని తెలిపారు.రాజకీయ చరిత్రలో విలువలు కలిగిన నాయకుడు చంద్రబాబు అని గుర్తు చేశారు. ఆనాడు అక్రమ అరెస్టును రాష్ట్రంతో పాటు దేశ ప్రజలు సైతం ఖండించారని,అనేక నిరసన కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. భువనేశ్వరమ్మ సైతం నిజం గెలవాలి కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేశారని,ప్రజలంతా ఆ కార్యక్రమానికి బాసటగా నిలిచారన్నారు.అనంతరం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను చంద్రబాబు నెరవేరుస్తున్నారని,రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్,కేంద్ర ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తోందన్నారు.ఎన్డీఏ కూటమికి ప్రజలంతా బాసటగా నిలవాలని,రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా వైసీపీ శ్రేణులకు ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

## మహిళలు,పిల్లల భద్రతపై అంగన్‌వాడీ కార్యకర్తలకు సీఐ అవగాహన

**సామాజిక రక్షణలో అంగన్‌వాడీల పాత్ర కీలకం సీఐ వెంకటేశ్వరరావు**

**పోషణ్ మాసం-2026లో భాగంగా అవగాహన సదస్సు**



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** సమాజంలో మహి ళలు, పిల్లల రక్షణతో పాటు సైబర్ నేరాలు,మత్తు పదార్థాల రహిత సమాజ స్థాపనకు అం గన్ వాడీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని నాయు డుపేట టౌన్ సీఐ సి.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం నాయుడుపేటలోని సిడిపిఓ కార్యాలయంలో పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో నాయుడుపేట ప్రాజెక్టు పరిధిలోని సుమారు 225 మంది అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు"పోషణ్ మాసం-2026"కార్యక్రమంలో భాగంగా సీఐ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.మహిళలు, పిల్లల భద్రత,సైబర్ నేరాల నివారణ,మత్తు పదార్థాల నిర్మూలన వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.క్షేత్రస్థాయిలో నిత్యం మహిళలు,గర్భిణులు, బాలింతలు, పిల్లలతో మమేకమయ్యే అంగన్‌వాడీ కార్యకర్తలు వారి భద్రతపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. గృహహింస, వేధింపులు,బాల్యవివాహాలు దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు లేదా హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.సైబర్ మోసాల నుంచి రక్షణకు తెలియని నంబర్ల ఓటీపీలు,యాప్ లింకులను క్లిక్ చేయవద్దని,మోసం జరిగితే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌ను ఆశ్రయించాలని తెలిపారు. గంజాయి,డ్రగ్స్ వల్ల యువత జీవితాలు నాశనమవుతున్నాయని,అక్రమ విక్రయం, వినియోగం దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, సీడీపీఓ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు,సిబ్బంది పాల్గొన్నారు. సామాజిక రక్షణలో అంగన్‌వాడీల పాత్ర కీలకమని,వారి సహకారంతోనే భద్రత,అవగాహన పెంచగలమని సీఐ వెంకటేశ్వరరావు అన్నారు.

## ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలల్లో అక్షరాస్యత దినోత్సవం,ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు

**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:**జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి ఆదేశాల మేరకు కళాశాలల్లో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో అక్షరాస్యత దినోత్సవం మరియు ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ మరియు ఎన్ఎస్ఎస్ పి.ఓ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు అక్షరాస్యత ప్రాముఖ్యత,విద్య ద్వారా వ్యక్తిగత మరియు సామాజిక అభివృద్ధి,ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా మారాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాగింగ్ వల్ల కలిగే దుష్పరిణామాలు,విద్యార్థులపై దాని ప్రభావం, ర్యాగింగ్‌కు పాల్పడితే ఎదురయ్యే చట్టపరమైన చర్యలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.కళాశాలలో ర్యాగింగ్‌కు తావులేకుండా ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో, స్నేహభావంతో మెలగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మల్లికార్జున, విజయశేఖర్,ఉల్గోజీ రావు,సోమేశ్,శ్రీధర్ మూర్తి, బాలూ,ఇంతియాజ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.





## ‘టాక్సిక్’ ఫలితంపై యశ్ స్పందన.. ఏమన్నారంటే?

**‘టాక్సిక్’ సినిమా ఫలితంపై స్పందించిన నటుడు యశ్**
**ఫలితం గురించి బాధపడొద్దని సన్నిహితుడితో వ్యాఖ్య**
**ప్రేక్షకుల తీర్పును గౌరవిద్దామని సూచన**
**యశ్ మాటల్లో బాధ కనిపించిందన్న ఆయన స్నేహితుడు జైదేవ్**

కన్నడ రాకింగ్ స్టార్ యశ్ నటించిన ‘టాక్సిక్’ చిత్ర ఫలితంపై ఆయన స్పందన ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. యశ్ సన్నిహితుడైన జైదేవ్ ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, సినిమా విడుదల అనంతరం తాను యశ్‌తో రెండుసార్లు మాట్లాడానని వెల్లడించారు. ఆ సంభాషణలో యశ్ ఏమన్నారో జైదేవ్ వివరించారు.జైదేవ్‌తో యశ్ మాట్లాడుతూ, “సినిమా ఫలితం గురించి ఆందోళన చెందవద్దు. దాన్ని ప్రేక్షకుల నిర్ణయానికే వదిలేద్దాం. రాబోయే రోజుల్లో మనం చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి” అని పేర్కొన్నట్లు జైదేవ్ తెలిపారు. యశ్ ధైర్యంగా ఈ మాటలు చెప్పినప్పటికీ, ఆయన గొంతులో మాత్రం స్వల్ప నిరాశ కనిపించిందని జైదేవ్ అభిప్రాయపడ్డారు.సినిమా ఫలితంతో సంబంధం లేకుండా ప్రేక్షకుల తీర్పే అంతిమమని జైదేవ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం యశ్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో అభిమానుల మధ్య చర్చనీయాంశమయ్యాయి. తదుపరి ప్రాజెక్టులపై దృష్టి సారించాలన్న యశ్ నిర్ణయాన్ని అభిమానులు హర్షిస్తున్నారు.

# ‘గాంధారి’ ( నెట్ ఫ్లిక్స్) మూవీ రివ్యూ!




బాలీవుడ్ లో ఇప్పుడు లేడీ ఓరియెంటెడ్ కథలకు కేరాఫ్ అడ్రెస్ గా తాప్సీ కనిపిస్తుంది. కథ ఏదైనా దానిని భుజాన వేసుకుని మోయగల సత్తా తనకి ఉందని ఆమె నిరూపించింది. అందుకు నిదర్శనంగా నిలిచే సినిమాలు ఆమె కెరియర్లో కనిపిస్తాయి. అలాంటి తాప్సీ రీసెంట్ గా చేసిన సినిమానే ‘గాంధారి’. దేవాశిష్ మఖీజా దర్శకత్వం వహించిన ఈ సినిమా, సెప్టెంబర్ 3వ తేదీ నుంచి ‘నెట్ ఫ్లిక్స్’లో స్ట్రీమింగ్ అవుతోంది. హిందీతో పాటు ఇతర భాషలలోను అందుబాటులోకి వచ్చింది.‘బని’ (తాప్సీ) ఆమె భర్త ‘గోకుల్’ (ఇష్వాక్ సింగ్) తమ ఐదేళ్ల కూతురు ‘మిస్తీ’తో కలిసి రైల్లో వెళుతూ ఉంటారు. మార్గమధ్యంలో రైలు ‘జాయ్ పూర్’ స్టేషన్ లో ఆగుతుంది. ఆ సమయంలోనే ఒక గుర్తుతెలియని మహిళ, ‘మిస్తీ’ని కిడ్నాప్ చేస్తుంది. తన కూతురును కాపాడుకునే ప్రయత్నంలో ‘బని’ కంటిచూపు దెబ్బతింటుంది. తమ కూతురును కాపాడమని పోలీసులను వాళ్లు ఎంతగా ప్రాధేయపడినా ప్రయోజనం లేకుండా పోతుంది. వరుసగా జరుగుతున్న ఆడపిల్లల కిడ్నాపుల వెనుక ఎవరున్నారనేది తెలుసుకోవడానికి పోలీస్ ఆఫీసర్ ‘కబీర్’ రంగంలోకి దిగుతాడు. అయితే మిగతా ఆఫీసర్లు ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉండటం వలన, ఆయన ఏమీ చేయలేకపోతుంటాడు. అలాంటి పరిస్థితులలో ‘బని’ని ‘జును అంబా’ (మిత వశిష్ఠ్) కలుసుకుంటుంది. ‘జాయ్ పూర్’లో ‘బ్లాక్ హోల్’ అనే ఒక గ్యాంగ్ ఉందనీ, ఆ గ్యాంగ్ ఆడపిల్లలను అక్రమంగా ఇతర దేశాలకు తరలిస్తుందని చెబుతుంది. తనకి తెలిసి ‘మిస్తీ’ ఇంకా జాయ్ పూర్ లోనే ఉండి ఉంటుందని అంటుంది. కొన్ని రోజుల తరువాత ‘బనీ’కి చూపువస్తుంది. అయితే జాయ్ పూర్ లో ఏ మూలన ఏం జరుగుతుందనేది తెలుసుకోవడం, చూపురానట్టుగానే నటిస్తుంటుంది. జాయ్ పురా నుంచి సముద్రం మీదుగా పిల్లలను తరలించడానికి ఏయే మార్గాలు ఉన్నాయనే రహస్యాన్ని ఛేదించడం కోసం ధైర్యంగా ముందుకు వెళుతుంటుంది. ఆ ప్రయత్నంలో ఆమెకి తెలిసే చేదు నిజాలేమిటి? ఎదురయ్యే సవాళ్లు ఎలాంటివి? జును అంబాతో ఆమెకి గల అనుబంధం ఏమిటి? తన కూతురును ఆమె కాపాడుకోగలుగుతుందా? అనేది మిగతా కథ. ఒక తల్లి .. కనిపించకుండా పోయిన తన కూతురు ఆచూకీ తెలుసుకోవడం కోసం రంగంలోకి దిగుతుంది. ఆ సమయంలో తన చూపు కోల్పోయినా ఆమె లెక్క చేయదు. ఆడపిల్లలను అక్రమంగా తరలించే ఒక గ్యాంగ్ గురించి తెలుసుకుని, ఒంటరిగా వాళ్లను ఎదిరించడానికి సిద్ధమవుతుంది. అందుకోసం ఆమె ఎలాంటి ప్రమాదాలకు ఎదురెళ్లవలసి వస్తుంది? అనేదే ఈ కథలోని ప్రధానమైన అంశం అని చెప్పాలి.బని దంపతులు రైల్వే స్టేషన్ లో తమ కూతురును పోగొట్టుకోవడం .. పోలీసుల చుట్టూ తిరగడం .. తామే అన్వేషణ కొనసాగించడం .. అక్కడి గ్యాంగ్ గురించి తెలుసుకోవడం ఫస్టాఫ్ గా కొనసాగుతుంది. ఇక ఆ గ్యాంగ్ కదలికలను గమనించడం .. వాళ్ల బారి నుంచి తమ బిడ్డను కాపాడుకోవడానికి ప్రయత్నించడం సెకండాఫ్ గా కనిపిస్తుంది.చిన్నపిల్లల అక్రమ రవాణ .. ఆ ముఠాను పట్టుకోవడానికి జరిగే ప్రయత్నాల నేపథ్యంలో గతంలో చాలానే సినిమాలు వచ్చాయి. అయితే ఈ కథలో రెండు విషయాలు కొత్తగా అనిపిస్తాయి. చూపు కోల్పోయిన తల్లి తన బిడ్డ ఆచూకీ తెలుసుకోవడానికి ప్రయత్నించడం ఒకటైతే, దాదాపు నేరస్థులతోనే ‘జాయ్ పుర’ విలేజ్ ను డిజైన్ చేయడం మరొకటి. తన చుట్టూ ఉన్నవాళ్లంతా, బ్లాక్ హోల్ కి సంబంధించినవాళ్లేనని ‘బని’ గ్రహించే విధానం ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. అయితే ఆడియన్స్ ఆశించే స్థాయిలో దర్శకుడు ఈ కథను తెరపై ఆవిష్కరించలేకపోయాడు. ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్ ‘కబీర్’ అంటూ హడావిడి చేశారు. కానీ ఆయన వచ్చి చేసేది ఏమీ ఉండదు. ఆయన తెరపై నుంచి ఎప్పుడు పక్కకి తప్పుకున్నాడనే విషయం కూడా ప్రేక్షకులకు గుర్తుండదు. పోనీ విలన్ వైపు నుంచి కదలికలు ఏమైనా ఉన్నాయా అంటే, అటు వైపు నుంచి కూడా అదే పరిస్థితి. యాక్షన్ .. ఎమోషన్ .. చివర్లో వచ్చే ట్విస్ట్ .. ఇవన్నీ కూడా చాలా రొటీన్ గా అనిపిస్తాయి. ప్రధానమైన పాత్రలను పోషించిన వాళ్లంతా తమ పాత్రలకు న్యాయం చేశారు. ఫొటో గ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. టైటిల్ ఇంట్రెస్టింగ్ గా అనిపించినప్పటికీ, కథాకథనాల పరంగా రొటీన్ గా అనిపించే కంటెంట్ ఇది. ఎలాంటి అభ్యంతరకరమైన సన్నివేశాలుగానీ .. సంభాషణలు గాని లేని ఈ సినిమాను, ఫ్యామిలీతో కలిసి ఓ సారి చూడాలనుకుంటే చూడొచ్చు.



# దులీప్ ట్రోఫీ: ఇషాన్ కిషన్ మరోసారి విధ్వంసం..

# ఈస్ట్ జోన్‌కు 584 పరుగుల భారీ ఆధిక్యం

దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో సౌత్ జోన్‌పై ఈస్ట్ జోన్ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించి తన పట్టును మరింత బిగించింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా బుధవారం జరిగిన నాలుగో రోజు ఆటలో, కెప్టెన్ ఇషాన్ కిషన్ (80), శిఖర్ మోహన్ (52) అద్భుతమైన హాఫ్ సెంచరీలతో రాణించారు. దీంతో ఆట ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ ఏకంగా 584 పరుగుల భారీ ఆధిక్యం సాధించి, టైటిల్‌ను దాదాపు ఖాయం చేసుకుంది.



### ఇషాన్, మోహన్ అద్భుత భాగస్వామ్యం

తొలి ఇన్నింగ్స్‌లో 372 పరుగుల భారీ ఆధిక్యం ఉన్నప్పటికీ, ఈస్ట్ జోన్ ఫాలో ఆన్ విధించకుండా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. అయితే, ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ (8), అభిమన్యు ఈశ్వరన్ (0) విఫలమవడంతో ఆరంభంలో తడబడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్, శిఖర్ మోహన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 170 బంతుల్లో 126 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. ముఖ్యంగా ఇషాన్ కిషన్ తనదైన శైలిలో విధ్వంసక బ్యాటింగ్‌తో అలరించాడు. కేవలం 98 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 80 పరుగులు చేశాడు. విజయ్ వేసిన ఒకే ఓవర్లో రెండు సిక్సర్లు, రెండు ఫోర్లతో 20 పరుగులు రాబట్టి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మరో భారీ షాట్‌కు ప్రయత్నించి కిషన్ ఔటవగా, నిలకడగా ఆడిన శిఖర్ మోహన్ (52) కూడా పెవిలియన్ చేరాడు.

### ఒక్క పరుగుతో శతకం చేజార్చుకున్న తిలక్ వర్మ

అంతకుముందు, ఉదయం సెషన్‌లో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌత్ జోన్ 336 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ తిలక్ వర్మ అద్భుత పోరాట పటిమ కనబరిచాడు. అయితే, దురదృష్టవశాత్తూ ఒక్క పరుగు తేడాతో తన తొమ్మిదో ఫస్ట్‌క్లాస్ సెంచరీని చేజార్చుకున్నాడు. 99 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కౌనైన్ ఖురేషీ బౌలింగ్‌లో రిటర్న్ క్యాచ్ ఇచ్చి నిరాశగా వెనుదిరిగాడు. మరో ఎండ్‌లో సీవీ మిలింద్ (43) అతనికి చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత సౌత్ జోన్ ఇన్నింగ్స్ త్వరగా ముగిసింది. ముఖేష్ కుమార్ 3 వికెట్లతో రాణించాడు.

నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. కుమార్ కుశాగ్ర (34 నాటౌట్), ఖురేషీ (26 నాటౌట్) క్రీజులో ఉన్నారు. చివరి రోజు ఆట నామమాత్రమే కాగా, ఈస్ట్ జోన్ విజయం లాంఛనమేనని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

### సంక్షిప్త స్కోర్లు:

ఈస్ట్ జోన్: 708 & 212/5 (ఇషాన్ కిషన్ 80, శిఖర్ మోహన్ 52)
సౌత్ జోన్: 336 (తిలక్ వర్మ 99, ముఖేష్ కుమార్ 3/62)



## యూఎస్ ఓపెన్‌లో పెను సంచలనం..

## అల్కరాజ్‌కు షాకిచ్చిన షెల్టన్.. సచిన్ స్పందన ఇదే!

టెన్నిస్ ప్రపంచంలో పెను సంచలనం నమోదైంది. యూఎస్ ఓపెన్ డిఫెండింగ్ ఛాంపియన్, స్పెయిన్ సంచలనం కార్లోస్ అల్కరాజ్‌కు అమెరికా యువ కెరటం బెన్ షెల్టన్ భారీ షాకిచ్చాడు. హోరాహోరీగా సాగిన క్వార్టర్ ఫైనల్ పోరులో అద్భుతమైన ఆటతీరుతో అల్కరాజ్‌ను మట్టికరిపించి సెమీ ఫైనల్‌లోకి దూసుకెళ్లాడు. ఈ ఉత్కంఠభరిత పోరుపై భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించారు.బుధవారం జరిగిన ఈ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆద్యంతం అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. మొత్తం 4 గంటల 28 నిమిషాల పాటు సాగిన ఈ ఐదు సెట్ల థ్రిల్లర్‌లో షెల్టన్ 6-7(5), 6-1, 6-3, 1-6, 7-6(10/7) తేడాతో అల్కరాజ్‌పై విజయం సాధించాడు. నిర్ణయాత్మక ఐదో సెట్ టైబ్రేక్‌కు దారితీయగా, షెల్టన్ తన నరాలపై పూర్తి నియంత్రణతో ఆడి చారిత్రక విజయాన్ని అందుకున్నాడు. 146 మైళ్ల వేగంతో ఏస్ సంధించి మ్యాచ్‌ను ముగించాడు. యూఎస్ ఓపెన్ చరిత్రలోనే అత్యంత ఆలస్యంగా ముగిసిన మ్యాచ్‌గా ఇది రికార్డు సృష్టించింది. ఈ మ్యాచ్ తెల్లవారుజామున 3.33 గంటలకు ముగిసింది. గతంలో ఈ రికార్డు కూడా అల్కరాజ్ (అర్ధరాత్రి తర్వాత 2.50 గంటలకు ముగిసింది) పేరు మీదే ఉండటం గమనార్హం.ఈ ఉత్కంఠభరిత మ్యాచ్‌ను ఉద్దేశించి భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ‘ఎక్స్’ వేదికగా స్పందించాడు. “ఇది అద్భుతమైన టెన్నిస్! ఒకరు మ్యాచ్ గెలుస్తారనుకున్న ప్రతిసారీ, మరొకరు అద్భుతంగా పుంజుకున్నారు. చివరికి కొన్ని పాయింట్ల తేడాతో ఫలితం తేలింది. అద్భుతంగా ఆడావు బెన్ షెల్టన్! కార్లోస్, ఇది కఠినమైన ఓటమి. గాయం తర్వాత పునరాగమనం చేసి ఆడటం వల్ల ఇది మరింత కష్టంగా ఉంటుంది” అని పోస్ట్ చేశాడు.ఈ విజయంతో అల్కరాజ్ 18 మ్యాచ్‌ల గ్రాండ్‌స్లామ్ విజయ పరంపరకు షెల్టన్ అడ్డుకట్ట వేశాడు. ఇది షెల్టన్ కెరీర్‌లోనే అతిపెద్ద విజయంగా నిలిచింది. గాయం కారణంగా సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగిన అల్కరాజ్.. రోజర్ ఫెదరర్ తర్వాత యూఎస్ ఓపెన్ టైటిల్‌ను నిలబెట్టుకున్న ఆటగాడిగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. కానీ, క్వార్టర్స్‌లోనే అతని ప్రయాణం ముగిసింది.మాంట్రియల్‌లో తన రెండో ఏటీపీ మాస్టర్స్ 1000 టైటిల్ గెలిచి మంచి ఫామ్‌లో ఉన్న షెల్టన్.. 2023 తర్వాత మళ్లీ యూఎస్ ఓపెన్ సెమీ ఫైనల్‌కు చేరుకున్నాడు. సెమీస్‌లో మరో అమెరికన్ ఆటగాడు ఫ్రాన్సెస్ టియాఫోతో తలపడనున్నాడు. వీరిద్దరూ తమ తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ బెర్త్ కోసం పోటీ పడనున్నారు. ఈ విజయంతో ఈ ఏడాది యూఎస్ ఓపెన్‌లో బెన్ షెల్టన్ అతిపెద్ద ఆకర్షణగా నిలిచాడు.



# 28 న దళిత ధర్మ పోరాట దీక్ష

**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం:** దళితులపై జరుగుతున్న హత్యలను నిరసిస్తూ ఈనెల 28వ తేదీన కడప కలెక్టరేట్ ముందు జరగబోవు ధర్మ పోరాట దీక్షకు దళితులందరూ ఐక్యంగా వచ్చి ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం ప్రొద్దుటూరు పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద దీక్షకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ధర్మ పోరాట దీక్షలో ఏపీ ఎంఆర్పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు ఆధ్వర్యంలో ధర్మ పోరాట దీక్ష జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో దళితులు ఎక్కువగా హత్యకు గురి అవుతున్నారని అలాగే హత్యకు గురైన దళిత కుటుంబాలకు ప్రభుత్వం కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అగ్రవర్ణాల వారు హత్యకు గురైతే కోటి రూపాయలు ప్రభుత్వం పరిహారం ఇస్తుందని దళితులకు మాత్రం ఇవ్వడం లేదని అందరికీ ఒకే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎస్సీ ఎస్టీ కేసులు హత్య కేసులు ఫాస్ట్ ట్రాక్కోటుకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజుపాలెం మండల అధ్యక్షుడు కొర్రపాడు మురళీ మాదిగ, తొండలదిన్నె గ్రామానికి చెందిన ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మారయ్య మాదిగ. తప్పెట కళాకారుల గురువు బండారు రాజు మరి కొంతమంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ తీరు అభినందనీయం

**- రాష్ట్ర ఎన్ జీ జి ఓ అధ్యక్షుడు విద్యా సాగర్**



**మైదుకూరు -సూర్య వాస్తవం:** గత ప్రభుత్వ కాలంలో పెండింగ్‌లో ఉన్న బకాయిల చెల్లింపులతో పాటు, ఉపాధ్యాయులు మరియు ఉద్యోగులకు సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయమని రాష్ట్ర ఎ పి ఎన్ జీ జి ఓ అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ తెలిపారు. బుధవారం కడప జిల్లా పర్యటన, ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా నీటి పారుదల కార్యాలయంనుండి భారీగా ర్యాలీ గా జిల్లా పరిషత్ కార్యాలయంలోని సభా భవనంలో ఎ పి ఎన్ జీ జి ఓజిల్లా అధ్యక్షుడు బలపనూరు శ్రీనివాసులు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసిన సదస్సులో విద్యాసాగర్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల దీర్ఘకాలిక డిమాండ్లలో భాగంగా అదనపు క్వాంటమ్ పెన్షన్ పునరుద్ధరణ, అలాగే పిఆర్సీ కమిటీ నియామకానికి ప్రభుత్వం అంగీకారం తెలపడం పట్ల ఆయన ఉద్యగుల హర్షధ్వానాల మధ్య హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ బకాయిలను క్రమంగా పరిష్కరించడంతో పాటు, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఉద్యోగుల్లో నమ్మకాన్ని పెంచుతున్నాయని రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ పేర్కొన్నారు.
ఉపాధ్యాయులు, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను గుర్తించి పరిష్కరించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగడం స్వాగతించదగ్గ పరిణామమని, ఇదే స్ఫూర్తితో మిగిలిన పెండింగ్ సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర అధ్యక్షుడు కోరారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల అధ్యక్షులతో పాటు కడప జిల్లాలోని అన్ని తాలూకా యూనిట్ లు, మైదుకూరు తాలూకా ఎ పి ఎన్ జీ జి ఓ అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ ను, జనరల్ సెక్రటరీ డివి రమణని ఘనంగా శాలువ, పూల మాలలతో, బుకే లతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. అధ్యక్షుడు గజ్జల చంద్రమౌళి, సెక్రటరీ మాచనూరు రాఘవయ్య, కోశాధికారి లక్కినేని బాబు, ఉపాధ్యక్షులు రాజన్న, గురు ప్రసాద్, పెంచల్ రెడ్డి, చలపతి, సంయుక్త కార్యదర్శులు మునెయ్య మరియు మైదుకూరు తాలూకా ఎ పిఎన్ జీ జి ఓ కార్యవర్గ సభ్యులుమరియు పదవీ విరమణ పొందిన సబ్ ట్రెజరీ అధికారి మాచనూరు పుల్లయ్య లు పాల్గొన్నారు.

# చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు మూడేళ్లు

**-పులుగోరు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన**



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును గత వైసిపి ప్రభుత్వ హయాంలో అక్రమంగా అరెస్టు చేసి మూడు సంవత్సరాలు పూర్తి అయిందని తిరుపతి కోపరేటివ్ టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పులిగోరు మురళీ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అక్రమ అరెస్టు నిరసిస్తూ పులిగోరు మురళీకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో బైరాగి పట్టెడలో ఆయన ఇంటి వద్ద నిజం గెలిచింది కార్యక్రమాన్ని నిర్వహించి కొవ్వొత్తులను వెలిగించి న్యాయం గెలిచిందంటూ పేర్కొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొత్త వైసిపి ప్రభుత్వ పాలనలో అరాచకాలు అన్ని ఇన్ని కావని, ప్రజాధనాన్ని జగన్మోహన్ రెడ్డి అండ్ టీం లూటీ చేశారని ఆరోపించారు. చంద్రబాబు పై అక్రమ కేసు పెట్టి అర్ధరాత్రి అరెస్టు చేశారని, 53 రోజులు జైలు జీవితం గడపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు హేమంత్ యాదవ్, జలపోతు చంద్రశేఖర్ రెడ్డి,దొడ్డా రెడ్డి రామకృష్ణారెడ్డి, గంజి సుధాకర్ రెడ్డి,నాగ ప్రతాప్,దేవ ఆచార్య, మునిరాజా,సూరి, నారాయణరెడ్డి, ముని కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీనేజ్ గర్భధారణను నివారిద్దాం

**- డాక్టర్లు ఓబులేసు, కావ్య మాధురి, సుధా**



**చాపాడు -సూర్య వాస్తవం :** మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.ఓబులేసు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు ఓబులేసు, కావ్య మాధురి, గైనకాలజిస్ట్ డాక్టర్ సుధా లు, గర్భవతుల గురించి మాట్లాడుతూ "టీనేజ్ గర్భధారణ "కలలను ఆపేస్తుందని, అవకాశాలను తగ్గిస్తుందని, ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తుందని, అవగాహన, సరైన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా మన భవిష్యత్తును మనమే నిర్మించుకోవచ్చని డాక్టర్లు తెలిపారు. టీనేజ్ అమ్మాయిలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఎక్కువని,15-19 సంవత్సరాల వయస్సులో గర్భధారణ జరిగే శిశువు బరువు చాలా తక్కువగా ఉంటుందని గర్భవతులకు తెలిపారు. అలాగే విద్యకు అంతరాయం కలుగుతుందని భవిష్యత్తు అవకాశాలు తగ్గుతాయని వారు పేర్కొన్నారు. మానసిక వత్తిడి, ఆందోళన, నైరాశ్యం, పెరిగే ప్రమాదం ఉందన్నారు. టీనేజ్ గర్భధారణను నివారించడానికి మనం తీసుకోవసిన జాగ్రత్తలు ముఖ్యంగా అవగాహన, తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఉండడం, బాధ్య తాయుతమైన నిర్ణయాలు తీసుకోవడం, గౌరవించడం, సమానత్వం పాటించాలన్నారు .ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్షలాది అమ్మాయిలు గర్భ ధారణకు గురి అవుతున్నారని, 15-19 సంవత్సరాల వయస్సులో తల్లి అయితే పిల్లలు తక్కువ బరువుతో పుట్టడం జరుగుతుందన్నారు. టీనేజ్ తల్లులకు రక్త హీనత, హైబిపి, సిజేరియన్ డెలివరీస్ రావచ్చని గర్భవతులకు తెలిపారు. టీనేజ్ గర్భధారణ ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలో, చదువు మానేసిన వారిలో కనిపిస్తోందన్నారు. టీనేజ్ గర్భధారణ తల్లి బిడ్డకు ప్రమాదం ఎక్కువని, చదువుకొనే అమ్మాయిలకు అంతరాయం కలుగుతుందని, భయం, ఆందోళన, డిప్రెషన్, ఆత్మ విశ్వాసం తగ్గిపోవడం ఆర్థిక సమస్యలు, సామాజిక సమస్యలు, కుటుంబంలో అవమానం, సమాజంలో విమర్శలు, ఒంటరితనం లాంటివి ఉంటాయన్నారు.
టీనేజ్ గర్భధారణ నివారించడానికి చదువు ముఖ్యమని, సరైన నిర్ణయాలు తీసుకొనేటట్టు చేయాలని, మంచి స్నేహితులను ఎంచుకోవాలని , అవాంచిత సంబంధాలకు దూరంగా ఉండాలని, శారీరక సంబంధాలు గర్భ ధారణకు ప్రధాన కారణం అని, అమ్మాయిలు అవగాహనతో ముందడుగు వేయాలని, ఆరోగ్య కరమైన భవిష్యత్తు నిర్మించుకోవాలని వారు తెలియజేశారు. ముఖ్యంగా చిన్న వయసులో వివాహం చేయవద్దని , సురక్షితమైన లైంగిక ఆచరణలపై అవగాహన పెంచుకోవాలని, అలాగే కండోమ్స్ వంటి వాటి వినియోగంపై తెలుసుకొని ఉండాలన్నారు.
టీనేజ్ అమ్మాయిలు మానసికంగా,బలంగా, ఉండాలని, "లేదు అని చెప్పే ధైర్యం పెంపొందించుకోవాలని, సురక్షిత భవిష్యత్తు కోసం చదువు, ఆరోగ్యం, స్వప్నాలు, ఉన్నత జీవితం, అవగాహన తో ఉండాలన్నారు. ఆడ పిల్లల సహాయం కోసం హెల్ప్ లైన్ నంబర్స్ 1098,181,14416 సహాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి యం. రాఘవయ్య,సూపర్ వైజర్స్ ప్రసాద్, భవానీ, యం ఎల్ హెచ్ పి లు, ఎ ఎన్ యం లు, ఆశా కార్యకర్తలు, గర్భవతులు, ప్రజలు పాల్గొన్నారు.



**గర్భవతులకు భోజన వసతి**

నక్కల దిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎన్. ఒబాయ పల్లె మాజీ సర్పంచ్ ఓటు అంజనమ్మ,రవిలు దాదాపు 80 మందికి మంచి రుచికరమైన ఆహారాన్ని అందించారని వైద్యాధికారి డాక్టర్ పి.ఓబులేసు తెలియజేశారు. భోజన వసతి కల్పించిన మాజీ సర్పంచ్ దంపతులకు డాక్టర్లు, వైద్య సిబ్బంది కలిసి శాలువ పూల మాలలతో చిరు సన్మానం చేసి, వారికి ఆరోగ్య సిబ్బంది ధన్యవాదాలు తెలియజేశారు.

# ప్రతి పథకం లబ్ది పొందాలి అంటే పంట నమోదే ప్రామాణికం

- కె తిమ్మాపురం మరియు రాజు గురువాయపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం
- గడువు తేదీ లోగా ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలి
- మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి




**ముద్దనూరు-సూర్యవాస్తవం :** మండలంలోని కె తిమ్మాపురం మరియు రాజు గురువాయపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ లో సాగు చేసిన పంటలను పంట నమోదు చేయించుకొనుటకు చివరి తేదీ సెప్టెంబర్ 15 వ తేదీ అని రైతు లకు తెలిపారు. అలాగే పంట నమోదు చేసుకోకపోతే వ్యవసాయ శాఖ ద్వారా అమలుచేసే ఏ పథకాలు వర్తించవు అన్నారు. పంట నమోదు తప్పనిసరిగా చేసుకొని ఈ కేవైసి కూడా చేసుకోవాలి అన్నారు. వర్షాలు తక్కువ ఉన్నందువలన సాగు చేసిన పంటలకు బెట్ట రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలి అన్నారు. యూరియా ద్రావణం 2% లేదా19.19.19 అనే నీటిలో కరిగే ఎరువును 10 గ్రాములు చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి అన్నారు. రైతులు ఇష్టానుసారంగా ఎరువులు వాడరాదు అన్నారు. తదుపరి గ్రామంలో రైతు భీంచర్ల సరలమ్మ ఇంటి దగ్గర ఘన జీవామృతం తయారుచేసే విధానాన్ని డెమో రూపంలో చూపించినట్లు తెలిపారు. పకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చును అన్నారు. రైతులు ఎప్పటికప్పుడు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల మెళకువలు తెలుసుకుని పంటలు సాగు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. తదుపరి రాజు గుర్వాయపల్లె గ్రామంలో రైతు రాజుల ఉత్తమారెడ్డి డ్రిప్ పద్దతిలో సాగు చేసిన పచ్చి (బజ్జి)మిరప పంటను పరిశీలించి సాగు విధానాలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్లో లభించే రేటు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెట్టుబడి ఎంత, గిట్టుబాటు అవుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు సందీప్,పకృతి వ్యవసాయ సిబ్బంది రామ సుధ,సుబ్బమ్మ మరియు గ్రామ నాయకుడు బి.ప్రసాద్ రెడ్డి, సుబ్బారెడ్డి,రమేష్ రెడ్డి,ఉత్తమా రెడ్డి, రామాంజనేయులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బ్రహ్మంగారిమఠంలో బ్లాక్ సిలిండర్ల దందా

- మితిమీరుతున్న అక్రమ విక్రయాలు..
- పట్టించుకోని అధికారులు
- ఒక సిలిండర్ ధర 1600 నుండి 1800 బ్లాక్ లో విక్రయం



**బ్రహ్మంగారిమఠం -సూర్య వాస్తవం:** మండల కేంద్రంలో గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెట్ దందా మితిమీరుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ వినియోగదారులకు సకాలంలో సిలిండర్లు అందక ఇబ్బందులు పడుతుండగా కొందరు వ్యక్తులు అధిక ధరలకు సిలిండర్లను విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై సంబంధిత అధికారులు నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట వేసి, అక్రమంగా సిలిండర్లు నిల్వ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే తనిఖీలు చేపట్టి నిజానిజాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. బ్లాక్ మార్కెట్లో ఒక్కొక్క సిలిండర్ ధర 1600 నుంచి 1800 , 2000 వరకు వసూలు చేస్తూ సామాన్య ప్రజల నుండి అధిక మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు దీనిపైన ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి బ్లాక్ దందాను అరికట్టాలని ప్రజల కోరుకుంటున్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 .

## బీసీలు బలహీనులు కాదు..
# ఆత్మగౌరవంలో తలవంచరు..."మంత్రి సత్యకుమార్ యాదవ్"



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** బీసీలు సామాజికంగా వెనుకబడి ఉండొచ్చుగానీ. ఆత్మగౌరవం విషయంలో ఎవరి ముందు తలవంచే ప్రసక్తే లేదని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి,సత్యకుమార్ యాదవ్ అన్నారు. ధర్మవరం నియోజకవర్గంలోని గొట్లూరులో బుధవారం నిర్వహించిన భాజపా ఓబీసీ మోర్చా శ్రీ సత్యసాయి జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కుటుంబంలో జన్మించిన నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి వరుసగా మూడుసార్లు ప్రజల మద్దతు పొందడం బీసీలకు గర్వకారణమన్నారు."సబ్‌కా సాథ్..సబ్‌కా వికాస్" స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి నిర్వహించనున్న సేవా కార్యక్రమాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.అంతేకాకుండా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి,అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనాలు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు"సేవా సేతు"కార్యక్రమాల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ముందుండాలని సూచించారు.సెప్టెంబరు 17న ప్రతి గ్రామంలో"ఆశీర్వాద దీపం"కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు.ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి గత రెండేళ్లలో అనేక కార్యక్రమాలు చేపట్టామని సత్యకుమార్ తెలిపారు. జలజీవన్ మిషన్,రహదారుల నిర్మాణం,ఉపాధి హామీ, విద్యుత్ సమస్యల పరిష్కారం వంటి పనులు జరుగుతున్నాయన్నారు. కదిరి--ముదిగుబ్బ మధ్య సుమారు రూ.650 కోట్లతో హైవే అభివృద్ధి పనులు తీసుకొస్తున్నామని చెప్పారు.ఆయుర్వేద వైద్య కళాశాల, మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్,ముదిగుబ్బలో ఆస్పత్రి,గ్రామాల్లో విలేజ్ హెల్త్ సెంటర్లు,ధర్మవరంలో డయాలసిస్ సదుపాయాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని వివరించారు. ఓటు వేసినా. వేయకపోయినా నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరినీ కుటుంబ సభ్యులుగా భావించి సేవ చేయడం తన బాధ్యతన్నారు.అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచడంతో పాటు ఇంటి వద్దకే అందిస్తున్నామని పేర్కొన్నారు.ఆయుష్మాన్ భారత్ ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల వరకు వైద్య సహాయం అందుతోందని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపి శ్రీనివాస్,భాజపా జిల్లా అధ్యక్షుడు జి.ఎం.శేఖర్, ఓబీసీ ఇన్‌ఛార్జి కాపు రామచంద్రారెడ్డి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి ఆనంద్,రాష్ట్ర కార్యదర్శులు చంటి, అశోక్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణ యాదవ్,జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు అనిల్, జిల్లా ఇన్‌ఛార్జి రామాంజనేయులు,జిల్లా ప్రధాన కార్యదర్శులు హరికృష్ణ,ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



## హెడ్ కానిస్టేబుల్ నూర్ మహమ్మద్ కు అరుదైన గౌరవం...

- కానిస్టేబుల్ ఘన సన్మానం చేసిన సీఐ దేవానంద్ బృందం...



**రాయదుర్గం – సూర్య వాస్తవం :** రాయదుర్గం అర్బన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ నూర్ మహమ్మద్ కు షార్ట్ ఫుట్ ముడవ స్థానం రావడంతో రాయదుర్గం అర్బన్ సీఐ దేవానంద్, సిబ్బంది కలిసి కానిస్టేబుల్ నూరు మొహమ్మద్‌కు ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా సిఐ దేవానంద్ మాట్లాడుతూ....అంకితభావంతో పనిచేసిన నూర్ మహమ్మద్ కు అరుదైన గౌరవం దక్కడం ప్రతి పోలీసు కి ఆదర్శమన్నారు. ఆంధ్రప్రదేశ్ డిజిపి హరీష్ కుమార్ గుప్తా చేతుల మీదుగా మెడల్ తీసుకోవడం రాయదుర్గం పోలీస్ స్టేషన్ కు కీర్తి ప్రతిష్ట తెచ్చిన నూర్ మహమ్మద్ ఆదర్శనీయమన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి పోలీస్ అంకితభావంతో పనిచేసే ఉన్నత అధికారులతో ఉత్తమ పోలీసులుగా అవార్డులు పొందాలని సీఐ దేవానంద్ ఆకాంక్షించారు. అనంతరం హెడ్ కానిస్టేబుల్ నూర్ మహమ్మద్ కు రాయదుర్గం పోలీస్ స్టేషన్లో ఘన సన్మానం చేశారు.

## గిరిజనులకు కేటాయించిన సంక్షేమ పథకాలు వారికే చెందాలి

- ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర ఎస్టి కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జి రెడ్డి



**పామిడి – సూర్య వాస్తవం :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని ఈ పథకాలన్నీ అర్హులైన లబ్ధిదారులకు సక్రమంగా అందేటట్లు చూడాలని రాష్ట్ర ఎస్టి కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జి రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జి రెడ్డి గారు అనంతపురం జిల్లా, పామిడి మండలం, పాళ్యం తండాలో గిరిజన ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్టి కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జి రెడ్డి మాట్లాడుతూ.అనంతపురం జిల్లాలో ఎక్కువగా గిరిజన తండాలు ఉన్నాయని గిరిజన ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన లేక వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారన్నారు. అధికారులు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి గిరిజనులకు అందాల్సిన సంక్షేమ ఫలాలు వారికే అందే విధంగా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. చెయ్యని నేరానికి కొంతమంది పోలీస్ అధికారులు గిరిజనులపై అక్రమ కేసులు పెట్టి వారిని ఇబ్బంది పెట్టడం జరుగుతోందని ఇలాంటి కేసులు తమ దృష్టికి వచ్చినట్లయితే పోలీస్ అధికారులపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఏమీ తెలియని గిరిజన అమాయకులపై అక్రమ కేసులు పెట్టడం చాలా బాధాకరమన్నారు. విద్యా ఉద్యోగాలలో గిరిజనులకు కేటాయించిన కోటాలో ఎటువంటి అన్యాయం జరగరాదన్నారు. జిల్లాలో చాలామంది ఎస్సీ ఎస్టీలకు ఇప్పటివరకు కూడా స్మశాన వాటికలు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యను రెవెన్యూ అధికారులు సీరియస్గా తీసుకొని వెంటనే ఎస్సీ ఎస్టీలకు స్మశాన వాటికకు స్థలం కేటాయించాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ తో పాటు ఎస్టి కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప, కె మల్లేశ్వరరావు లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి ఈ సమస్యలన్నీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించడం జరుగుతుందని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శ్రీనివాసులు, తహసిల్దార్ షర్మిల, ఎంపీడీవో ప్రభాకర్ నాయక్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ ఎస్టీ నాయకులు గిరిజన ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్ల కూటమి పాలనలో సూళ్లూరుపేట నియోజకవర్గం
# అవినీతి,అక్రమాలకు అడ్డాగా మారింది

- ఎఫ్‌డీఆర్,ఆర్ఆర్ఆర్ పనుల్లో కోట్లాది రూపాయల అవకతవకలు --సమగ్ర విచారణ జరిపించాలి
- డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు భయపడుతోంది?- "మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య"



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట నియోజకవర్గంలో రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలన మాటలకే పరిమితమైందని, అభివృద్ధి పనుల పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమవుతోందని, అవినీతి నిర్మూలించాల్సిన చోట అవినీతి తారస్థాయికి చేరిందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య తీవ్రస్థాయిలో విమర్శించారు. బుధవారం నాయుడుపేట పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి,అక్రమాలు,ప్రభుత్వ వైఫల్యాలపై పలు ఆరోపణలు చేశారు.సూళ్లూరుపేట,ఓజిలి మండలాల్లో చేపడుతున్న ఎఫ్‌డీఆర్ పనుల్లో సుమారు రూ.20 కోట్ల మేర అవకతవకలు జరుగుతున్నాయని,అలాగే ఆర్ఆర్ఆర్ పనులకు కేటాయించిన రూ.10 కోట్ల నిధుల కేటాయింపు, వ్యయంలోనూ అక్రమాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.

ఎమ్మెల్యే అనుచరులకు బినామీ పేర్లతో స్థలాలు కేటాయించి ప్రజా ఆస్తులను దోచుకుంటున్నారని విమర్శించారు.ఓజిలి మండలంలోని కుందాం, మాచవరం సెజ్ భూముల రికార్డులను బినామీ పేర్లతో మార్చి అన్యాక్రాంతం చేస్తున్నారని,రేషన్ బియ్యం మళ్లింపులోనూ ఎమ్మెల్యే బినామీల హస్తం ఉందని ఆరోపించారు.ఇసుక,మట్టి,గ్రావెల్ డంపింగ్ పేరుతో కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారని, ఉచిత ఇసుక పథకం మాటున అక్రమ వసూళ్లు, దోపిడీ జరుగుతోందని కిలివేటి సంజీవయ్య ఆరోపించారు.ఒక్క ఓజిలి మండలంలోని సగుటూరు చెరువులోనే కోట్ల రూపాయల నిధులను ఎమ్మెల్యే అనుచరులు దిగమింగుతున్నారని ఆయన విమర్శించారు.సగుటూరు చెరువు కట్టపై ఉన్న లక్షల రూపాయల విలువైన కర్రతుమ్మ తదితర చెట్లను పంచాయతీ అనుమతులు లేకుండా నరికివేసి తరలించారని,దీని ద్వారా సుమారు రూ.50 లక్షల వరకు స్వాహా చేశారని ఆరోపించారు.సగుటూరు చెరువుతో పాటు తిరుమలపూడి చెరువులోనూ పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని, నియోజకవర్గంలోని ఇతర చెరువుల నుంచి కూడా ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి,గ్రావెల్‌ను తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారని విమర్శించారు.చెరువు కట్టలపై ఉన్న విలువైన వృక్ష సంపదను నిబంధనలకు విరుద్ధంగా నరికివేసి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు.ఈ వ్యవహారంపై పంచాయతీ,ఇరిగేషన్ అధికారులను ప్రశ్నిస్తే తమ దృష్టికి రాలేదంటూ తప్పించుకుంటున్నారని, ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు సంబంధించిన బినామీ కాంట్రాక్టర్ల ఒత్తిళ్లతో అధికారులు భయపడుతున్నారనే ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. మీడియా ద్వారా అవినీతి,అక్రమాలు వెలుగులోకి వస్తున్నప్పటికీ ఉన్నత

"డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి"

డీఎస్సీ నియామకాల్లోనూ పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ ఆరోపిస్తోందని కిలివేటి సంజీవయ్య తెలిపారు.ఈ వ్యవహారంపై నిరాహార దీక్షలు,ర్యాలీలు నిర్వహిస్తూ సీబీఐ విచారణ కోరుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు.తప్పు చేయనివారు సీబీఐ విచారణకు ఎందుకు భయపడాలని ఆయన ప్రశ్నించారు. జూన్‌లో జెడ్‌డీ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాయిస్ పేపర్ పేరుతో సుధారాణి, చంద్రనాయక్,రియాజుల్లా,కాకోజి పాండు తదితరులు నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందారని ఆరోపించారు.కర్నూలు జిల్లా కోడుమూరు మండలం వల్లూరులో స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు ప్రభాకర్ తప్పుడు అర్హతలతో ఎంపికైన వ్యవహారం మీడియా ప్రసారాల ద్వారా వెలుగులోకి వచ్చిందని,ఆ తప్పును సరిదిద్దాల్సిన ప్రభుత్వం మీడియా ప్రచారాలను బ్లాక్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

"సంక్షేమ పథకాల అమలుపైనా ప్రభుత్వాన్ని నిలదీసిన కిలివేటి"ఈ కార్యక్రమంలో నాయుడుపేట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కలికి మాధవరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కామిరెడ్డి రాజారెడ్డి,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దాల సోమశేఖర్‌రెడ్డి, రూరల్ అధ్యక్షుడు ఓట్టూరు కిషోర్‌కుమార్ యాదవ్, ఓజిలి మండల అధ్యక్షుడు పాదర్తి,దొరవారిసత్రం మండల అధ్యక్షుడు అల్లూరు రాహుల్‌రెడ్డి,బైనా మల్లికార్జు నరెడ్డి,పేట చంద్రారెడ్డి,రాష్ట్ర కళాకారుల సెక్రటరీ కటకం జయరామయ్య,వేణుంబాకం మునుస్వామినాయుడు, ఎంపీపీలు కురుగొండ ధనలక్ష్మి,గడ్డం అరుణారెడ్డి, జిల్లా లీగల్ సెల్ సెక్రటరీ చదలవాడ కుమార్,మహిళా అధ్యక్షులు రత్నశ్రీ, లీగల్ సెల్ సెక్రటరీ ధారా రవి,గంధవల్లి సిద్దయ్య, నల్లారి ప్రకాశం,కావేరిపాకం అశోక్,మైనార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ షబ్బీర్,రూరల్ సెల్ అధ్యక్షులు నెలవాలి రవి,తన్నమాల రమణయ్య, యువ నాయకులు కాలగంధ సునీల్,మిజూరు బాల, వెంకటేశ్వర్లు తదితర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రబాబు అక్రమ అరెస్టుపై 53 దీపాలతో 'నిజం గెలిచింది' కార్యక్రమం

**కదిరి– సూర్య వాస్తవం :** కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు కదిరి పట్టణ టీడీపీ నాయకులు చంద్రబాబు అక్రమ అరెస్టుల పై అప్పటి జగన్ ప్రభుత్వం, నేటికీ మూడు సంవత్సరాల కాలం అయిన సందర్భంగా 'నిజం గెలిచింది' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కదిరి పట్టణంలోని హిందూపురం రోడ్డులో ఉన్న ఎమ్మెల్యే టీడీపీ కార్యాలయంలో 53 దీపాలు వెలిగించి "నిజం గెలిచింది.. న్యాయం గెలిచింది" అంటూ కార్యక్రమాన్ని నిర్వ హించారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ చేసి, రోడ్డు మార్గంలో కోర్టుకు తరలించి, ఈ సందర్భంగా టీడీపీ పట్టణ నాయకులు, మహిళా నాయకురాళ్లు, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి 53 దీపాలను వెలిగించారు. ఈ దీపాలు సత్యానికి, న్యాయానికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతీకగా నిలిచాయని నాయకులు పేర్కొన్నారు.

"అక్రమాలు ఎన్నాళ్లు దాగవు... సత్యం ఎన్నటికీ ఓడిపోదు" అని టీడీపీ నాయకులు అన్నారు. చంద్రబాబు నాయుడు పై ఎన్ని కుట్రలు, ఎన్ని ఆరోపణలు చేసినా చివరకు న్యాయమే గెలిచిందని, నిజమే గెలిచిందని పేర్కొన్నారుఈ కార్యక్రమంలో కదిరి పట్టణ టీడీపీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## తెలుగు చరిత్రలో చీకటి రోజు మాయం

- టిడిపి నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల వెలుగుల సంబరాలు
- నిజం గెలిసింది. నిజాయితీ నిర్ధారణ



**పామిడి – సూర్య వాస్తవం :** గుంతకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన తనయుడు టిడిపి పామిడి, గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ఆదేశాల మేరకు స్థానిక పామిడి పట్టణంలోని నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలవేసి తెలుగుదేశం పార్టీ నాయకులు తెలుగుజాతి చరిత్రలోనే ఎన్నటికీ మర్చిపోలేని ఒక చీకటి రోజు మటుమాయమై, నిజంగెలిచి, నిజాయితీ నిర్ధారణమైనదని, పామిడి మండల టిడిపి నాయకులు క్రొవత్తులు వెలిగించి పలు నినాదాలతో హోరెత్తించి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపినాయకులు మాట్లాడుతూ ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన చంద్రబాబునాయుడిని అక్రమ కేసులతో అరెస్ట్ చేసి వేధించడం నాటి ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని విమర్శించారు. ఇది చంద్రబాబు నాయకత్వంపై ప్రజలకున్న అచంచలమైన విశ్వాసానికి నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బొల్లుశ్రీనివాసరెడ్డి, జింకను సంజీవ, మోహన్ కృష్ణ, సుదర్శన్ రెడ్డి, టి టి రమణ శ్రీరాములు వెంకటరమణ అప్పన్న గారి కుమార్ వీరారెడ్డి రఘునాథ్ రెడ్డి మల్లేష్ రెడ్డి యాదవ సంఘం మండల అధ్యక్షుడు గుగ్గల్ల మల్లికార్జు నయాదవ్, రఫీ, రంగస్వామియాదవ్, దాసరినిరంజన్, ఓబులకృష్ణ, సుంకప్ప, బసవరాజు మంజు, అబ్దుల్ ఖాదర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ ఎన్నారై విభాగం అధ్యక్షుడిగా డాక్టర్ పి. గురురాజా బాధ్యతల స్వీకరణ...!

**- గురురాజాకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అభినందనలు**



**అనంతపురం – సూర్య వాస్తవం:** తెలుగు దేశం పార్టీ ఎన్నారై విభాగం అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పి. గురురాజాను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కలిసి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లా డుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రవాసులను తెలుగుదేశం పార్టీతో మరింత అనుసంధానం చేస్తూ, పార్టీని మరింత బలోపేతం చేయడంలో డాక్టర్ పి. గురురాజా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఎన్నారై విభాగం ద్వారా ప్రవాస తెలుగువారిని పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేసి, పార్టీకి మరింత బలమైన అంతర్జాతీయ అనుసంధానం కల్పించాలని కోరారు. డాక్టర్ పి. గురురాజా నాయకత్వంలో ఎన్నారై విభాగం మరింత క్రియాశీలకంగా పనిచేస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

## జీడిపల్లి రిజర్వాయర్‌లో ఫిషర్మన్ లైసెన్స్ విధానం అమలు చేయాలి...!

**- ఫిషరీస్ కమిషనర్ రామ్ శంకర్ నాయక్‌ను కలిసిన మత్స్యకారుల ప్రతినిధులు**



**అనంతపురం – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా జీడిపల్లి రిజర్వాయర్‌లో చేపల వేటకు ఫిషర్మన్ లైసెన్స్ విధానం అమలు చేయాలని కోరుతూ మత్స్యకారుల ప్రతినిధులు విజయవాడలోని ఫిషరీస్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ రామ్ శంకర్ నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పిఎబిఆర్ ఎఫ్టిఓ పెద్దబాబు నాయక్ ఆధ్వర్యంలో జీడిపల్లి రిజర్వాయర్‌కు చెందిన మత్స్యకారుల ప్రతినిధులు కమిషనర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. రిజర్వాయర్‌లో చేపల వేటకు లైసెన్స్ విధానం అమలు చేస్తే సంప్రదాయ మత్స్యకారులకు జీవనోపాధి కల్పించడంతో పాటు వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా రామసాగరం బి. పోతన్న, బి. బ్రాహ్మయ్య, అంకంపల్లి బి. నాగరాజు, జీడిపల్లి బి. మురళి, ఎస్. శివ తదితర మత్స్యకారుల ప్రతినిధులు కమిషనర్‌ను కలిసి ఫిషర్మన్ లైసెన్స్ విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మత్స్యకారుల సమస్యలను పరిశీలించి, నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని వారు కమిషనర్‌ను కోరారు.

## పార్థివ దేహానికి నివాళులర్పించిన... మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి...!

**- బాల నరసింహుడు కుటుంబ సభ్యులకు పరామర్శ**

**- మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన**





**అనంతపురం – సూర్య వాస్తవం :** రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం కుంటిమద్ది గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నరేంద్ర తండ్రి బాల నరసింహుడు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కుంటిమద్ది గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బాల నరసింహుడు భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాల నరసింహుడు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# 5 వేల కుక్కలకు ఆపరేషన్లు చేశారా? ఆధారాలేవి?

- రికార్డులు, ఎన్జీవోల సంతకాలపై ప్రశ్నలు
- సమగ్ర విచారణ జరపాలని డిమాండ్
- నేలపై కూర్చొని నిరసన తెలిపిన డిస్కవర్ అనిల్ ...!





**అనంతపురం కార్పొరేషన్ – సూర్య వాస్తవం :** అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కుక్కల ఆపరేషన్ల పేరుతో జరుగుతున్న వ్యవహారాలపై అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ అనిల్ కుమార్ నిరసనకు దిగారు. ఎంహెచ్ఓ క్యాబిన్‌లో నేలపై కూర్చొని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కుక్కల ఆపరేషన్లకు సంబంధించిన బిల్లులు, ఫైళ్ల క్లియరెన్స్, సంబంధిత కమిటీ సభ్యులు--ఎన్జీవోల సంతకాల విషయంలో నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశంపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. సంబంధిత కమిటీలోని ఎన్జీవో సభ్యుల సంతకాలకు బదులుగా సంబంధం లేని ఎన్జీవోలతో సంతకాలు చేయించి బిల్లులు పెట్టినట్లు ఆరోపించారు. గత నాలుగైదు సందర్భాల్లో ఎన్జీవోలు, మీడియా సమక్షంలో ఆర్గన్ కౌంట్ ఎందుకు నిర్వహించలేదని ఆయన ప్రశ్నించారు. మున్సిపల్ అధికారులు సుమారు 5 వేల కుక్కలకు ఆపరేషన్లు నిర్వహించినట్లు చెబుతున్నప్పటికీ, ఎన్జీవో ప్రతినిధుల ప్రాతినిధ్యం లేకుండానే నాలుగు, ఐదు ఫైళ్లు క్లియర్ చేసినట్లు చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. దీంతో అసలు ఆపరేషన్లు జరిగాయా? లేదా? వాటికి సంబంధించిన రికార్డులు ఏమిటి? బిల్లులు ఏ ప్రాతిపదికన చెల్లించారు? సంబంధిత ఎన్జీవోల సంతకాలు ఉన్నాయా? అనే అంశాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. కుక్కల నియంత్రణ, ఆపరేషన్లకు సంబంధించిన విధివిధానాలను అధికారులు పాటించారా లేదా అనే విషయాన్ని ఉన్నతాధికారులు పరిశీలించాలని అనిల్ కుమార్ కోరారు. ఆపరేషన్లకు సంబంధించిన ఫైళ్లు, బిల్లులు, కుక్కల సంఖ్య, ఆపరేషన్ రికార్డులు, ఎన్జీవోల ధ్రువీకరణ తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు, మీడియాకు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# ఉరవకొండ గిరిజన బాలికల గురుకులానికి సొంత భవనం కేటాయించాలి

**- ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బుజ్జి రెడ్డిని కోరిన గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాకే పురుషోత్తం**



**అనంతపురం – సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బుజ్జి రెడ్డిని అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాకే పురుషోత్తం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉరవకొండ నియోజకవర్గంలోని గిరిజన విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉరవకొండ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలకు ఇప్పటికీ సొంత భవనం లేకపోవడం దారుణమని సాకే పురుషోత్తం పేర్కొన్నారు. విద్యార్థినుల విద్యాభ్యాసానికి అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు వెంటనే సొంత భవనం కేటాయించడంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అదేవిధంగా నియోజకవర్గంలోని ఎస్టీ హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగుపరచాలని, విద్యార్థులకు మెరుగైన వసతి, విద్యా సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉరవకొండ నియోజకవర్గానికి ఏకలవ్య మోడల్ స్కూల్ మంజూరు అయ్యేలా కృషి చేయాలని ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌ను కోరారు. గిరిజనులకు రాజ్యాంగపరంగా లభిస్తున్న హక్కులు, రక్షణలు, ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే గిరిజనులకు అందాల్సిన సబ్సిడీ రుణాలు వెంటనే మంజూరయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన విద్యార్థులు, గిరిజన కుటుంబాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా సాకే పురుషోత్తం ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బుజ్జి రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు పోలా వీరాంజనేయులు పాల్గొన్నారు

## చదువుతో పాటు కొలువులు..

**- శ్రీ వెంకటేశ్వర కళాశాలలో మెగా జాబ్ మేళా విజయవంతం**

**- వివిధ కంపెనీల్లో పలువురు విద్యార్థుల ఎంపిక**

**- ఎంపికైన వారికి అక్కడికక్కడే అపాయింట్‌మెంట్ లెటర్లు**




**మైదుకూరు – సూర్య వాస్తవం :** మైదుకూరు పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్డీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. వివిధ రంగాలకు చెందిన పలు ప్రముఖ కంపెనీలు మేళాలో పాల్గొని విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. జాబ్ మేళాలో పాల్గొన్న విద్యార్థులు ఆయా కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబరిచి పలువురు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు కంపెనీల ప్రతినిధులు అపాయింట్‌మెంట్ లెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ దుగ్గిరెడ్డి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే కళాశాల ప్రధాన లక్ష్యమన్నారు. జాబ్ మేళా ద్వారా విద్యార్థులకు వివిధ కంపెనీల ప్రతినిధులతో నేరుగా మాట్లాడి, ఇంటర్వ్యూల్లో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభించిందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించిన ఆయన.. భవిష్యత్తులోనూ విద్యార్థుల భవిష్యత్ కోసం మరిన్ని జాబ్ మేళాలు, కెరీర్ గైడెన్స్, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కేశవ, వివిధ కంపెనీల ప్రతినిధులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి...!

**- పీస్ కమిటీ సమావేశంలో పత్తికొండ సీఐ సూచనలు**

**పత్తికొండ – సూర్య వాస్తవం :** వినాయక చవితి పండుగ, గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమా లను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించు కోవాలని పత్తికొండ సీఐ సూచించారు. వినాయక చవితిని పురస్కరించుకుని పత్తికొండ పోలీసుల ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో హిందూ, ముస్లిం సోదరులతో పాటు గణేష్ ఉత్సవ నిర్వాహకులు, వివిధ వర్గాల ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 14న వినాయక చవితి పండుగ, సెప్టెంబర్ 16న హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వద్ద గణేష్ విగ్రహాల నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు వివరించారు. నిమజ్జనం రోజున గణేష్ విగ్రహాలను సాధ్యమైనంత త్వరగా నిమజ్జన ప్రదేశానికి తరలించి, కార్యక్రమాన్ని క్రమబద్ధంగా పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. డీజేలు నిర్వహించరాదని, అధిక శబ్దంతో సంగీతం వినిపించకుండా పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఈసారి నిమజ్జనం రోజున సాధారణం కంటే ఎక్కువ సంఖ్యలో గణేష్ విగ్రహాలు వచ్చే అవకాశం ఉందని, అందువల్ల నిర్వాహకులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించి పోలీసు శాఖకు పూర్తిగా సహకరించాలని కోరారు. గణేష్ విగ్రహాల ఊరేగింపు సమయంలో మసీదులు, చర్చిలు, ఇతర ప్రార్థనా స్థలాల వద్ద సంయమనం పాటించాలని సూచించారు. ఎలాంటి వివాదాలకు, ఇతరులకు అసౌకర్యానికి తావులేకుండా ఊరేగింపులను నిర్వహించాలని కోరారు. ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరిస్తూ వినాయక చవితి, నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా, సోదరభావంతో, ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని పత్తికొండ సీఐ పిలుపునిచ్చారు.

